తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్త పత్రిక
14-09-2026
సోమవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 217
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక సిరి People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



## ముగిసిన బ్రిక్స్ సదస్సు..

### ఫలితాల దిశగా కీలక అడుగులు

- 21 దేశాల అధినేతలు, ప్రతినిధులకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు
- 45 పేజీల 'న్యూఢిల్లీ డిక్లరేషన్'కు సభ్యదేశాల ఆమోదం
- సమ్మిళిత అభివృద్ధికి పరస్పర సహకారం కీలకమన్న మోదీ

దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా రెండు రోజుల పాటు జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ఆదివారం ముగిసింది. భారత్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో విస్తరించిన బ్రిక్స్ కూటమి దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక, ఆరోగ్య, వాణిజ్య, ఆహార భద్రత, ఇంధనం తదితర రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చలు జరిగాయి. సభ్యదేశాలు 45 పేజీల 'న్యూఢిల్లీ డిక్లరేషన్'ను ఏకగ్రీవంగా ఆమోదించాయి.

మిగతా 3వ పేజీలో..

## 21 రాష్ట్రాల్లో యూసీసీ

- 2029లోగాఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతి అమలు
- వివాహం, విడాకులు, వారసత్వం, దత్తతకు ఒకే చట్టం
- ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ కొనసాగుతుందని అమిత్ షా వెల్లడి



2

## కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం



2

- పార్టీ వీడుతున్నట్లు జరుగుతున్న ప్రచారం నిరాధారమన్న కొండా సురేఖ
- కాంగ్రెస్ టికెట్‌పైనే అన్ని ఎన్నికల్లో పోటీ చేస్తామని స్పష్టం
- మంత్రి పదవి కోల్పోవడంపై బాధ లేదు.. కారణం చెప్పకపోవడమే బాధ
- అధిష్ఠానం నుంచి ఫోన్లు వచ్చాయి.. పార్టీ మారబోనని తేల్చిచెప్పా

## బ్రిక్స్ విందుపై రాహుల్ విమర్శలు



- శిఖరాగ్ర సదస్సు విందులో పూర్తిగా శాకాహార వంటకాలు
- 80 శాతం భారతీయులు మాంసాహారులేనన్న రాహుల్

2



## భారత్ నంబర్1 ఆర్థిక శక్తి!

- అమెరికా, చైనాలను అధిగమించే అవకాశం ఉందన్న జెఫ్రీ సాక్స్
- రాబోయే 25 ఏళ్లలో అమెరికాను దాటే భారత్
- చివరికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా

2





## ఆత్మగౌరవ భవనం..

# ఆర్యవైశ్యుల ఐక్యతకు ప్రతీక

- పేదరికం ఉన్నా ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిచ్చే సమాజం
- ఆర్థిక శాఖ వంటి కీలక బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్
- రోశయ్య సేవలను గుర్తుచేసుకున్న ముఖ్యమంత్రి
- గాంధీ, పొట్టి శ్రీరాములు త్యాగాలు దేశానికి స్ఫూర్తి
- భవన నిర్మాణాwwనికి ప్రభుత్వ సహకారం.. రాజకీయ ప్రాధాన్యంపై పిలుపు

### ఉప్పల్ భగాయత్‌లో నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన

హైదరాబాద్, సెప్టెంబర్ 13

హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్యుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆత్మగౌరవ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

**ఆత్మగౌరవానికి ప్రాధాన్యం**

ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగిన వారని రేవంత్‌రెడ్డి కొనియాడారు. సమాజంలో ఎంతోమంది పేదలు ఉన్నప్పటికీ.. తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ జీవించడానికే వారు ప్రాధాన్యమిస్తారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అవసరమైనప్పుడు అప్పు ఇచ్చే గుణం ఆర్యవైశ్యుల్లో ఉందని పేర్కొన్నారు. ఊరిలో ఏ శుభ కార్యం జరిగినా ఆర్యవైశ్య సోదరులు గుర్తుకొస్తారని చెప్పారు. ప్రపంచంలో వ్యవసాయం, వ్యాపారం రెండే ప్రధాన వృత్తులని.. తాను ఎప్పటి నుంచో ఆర్యవైశ్యుల శ్రేయోభిలాషినేనని సీఎం తెలిపారు.

**రోశయ్య సేవలకు గుర్తింపు**

చెన్నారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వంటి ముఖ్యమంత్రులుw

మిగతా 2వ పేజీలో..

## విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ఆటంకాలు తొలగాలి

- తెలంగాణ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి

2



## ఖమ్మంలో జనసేన శంఖారావం



- తెలంగాణలో పార్టీ విస్తరణకు కార్యాచరణ
- గడల శ్రీనివాసరావు విజయానికి కార్యకర్తలకు పిలుపు

3



3

## తెలంగాణ రక్షణ సేనలోకి నాగోబా ప్రధాన పూజారి

- మేస్రం ఆనందరావుకు కండువా కప్పి ఆహ్వానించిన కల్వకుంట్ల కవిత
- పలువురు సర్పంచులు, ముఖ్య నాయకుల చేరిక
- ఆదివాసీ ప్రాంతాల్లో పార్టీకి మరింత బలం
- ఈ నెల 20న కొడంగల్ కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ

## 11 రోజుల దర్యాప్తు.. నీడల వెంట పోలీసులు



3

- 500 సీసీ కెమెరాల ఫుటేజీను క్షుణ్ణంగా పరిశీలించిన టాస్క్‌ఫోర్స్
- 29, 30వ తేదీ రాత్రి దృశ్యాలపై సెకన్ టు సెకన్ విశ్లేషణ

# ముగిసిన బ్రిక్స్ సదస్సు..

- భౌగోళిక, రాజకీయ ఘర్షణల ప్రభావంపై ఆందోళన
- సాంకేతికత, కీలక ఖనిజాలను ఆయుధాలుగా మార్చడంపై హెచ్చరిక
- బ్రిక్స్ మూడో దశాబ్దంలో ఆచరణాత్మక ఫలితాలే లక్ష్యం
- తదుపరి బ్రిక్స్ సదస్సు చైనాలో.. అధ్యక్ష బాధ్యతలు అప్పగింత

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13:**

దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా రెండు రోజుల పాటు జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ఆదివారం ముగిసింది. భారత్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో విస్తరించిన బ్రిక్స్ కూటమి దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక, ఆరోగ్య, వాణిజ్య, ఆహార భద్రత, ఇంధనం తదితర రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చలు జరిగాయి. సభ్యదేశాలు 45 పేజీల 'న్యూఢిల్లీ డిక్లరేషన్'ను ఏకగ్రీవంగా ఆమోదించాయి. ముగింపు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. సదస్సుకు హాజరైన దేశాధినేతలు, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రిక్స్ కూటమి మూడో దశాబ్దంలోకి అడుగు పెడుతున్న నేపథ్యంలో.. ఇకపై ప్రపంచం ఈ కూటమి నుంచి కేవలం ఆలోచనలు, వాగ్దానాలు కాకుండా ప్రజలకు ఉపయోగపడే ఆచరణాత్మక ఫలితాలను ఆశిస్తోందని స్పష్టం చేశారు. తదుపరి బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో ఆ దేశానికి శుభాకాంక్షలు తెలిపారు. భారత్ నుంచి చైనాకు బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు.

**సమ్మిళిత అభివృద్ధికి సహకారం**

ప్రపంచం ప్రస్తుతం అనేక సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటోందని మోదీ అన్నారు. భౌగోళిక, రాజకీయ ఘర్షణలు పెరగడం, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు, వాతావరణ మార్పులు వంటి పరిణామాల ప్రభావం నేరుగా సామాన్య ప్రజలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సవాళ్లను అధిగమించేందుకు బ్రిక్స్ దేశాల మధ్య సమన్వయం, పరస్పర సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. న్యూఢిల్లీ డిక్లరేషన్‌లోనూ ప్రపంచ దక్షిణ దేశాల అభివృద్ధి, ఆర్థిక సహకారం, ఆహార భద్రత, ఇంధనం, కృత్రిమ మేధస్సు, వాతావరణ చర్యలు, ఆరోగ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అంతర్జాతీయ వ్యవస్థలో బహుళ ధ్రువ ప్రపంచానికి మద్దతు, ఐక్యరాజ్యసమితి సంస్కరణల అవసరాన్ని కూడా సభ్యదేశాలు ప్రస్తావించాయి.

**సాంకేతికత, ఖనిజాలపై ఆందోళన**

అత్యాధునిక సాంకేతికత, కీలక ఖనిజాలను కొన్ని శక్తులు ఆయుధాలుగా మార్చుకునే పరిస్థితులపై ప్రధాని మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతికత ప్రపంచ అభివృద్ధికి ఉపయోగపడాల్సిందే తప్ప.. దేశాల మధ్య ఆధిపత్య పోరులో సాధనంగా మారకూడదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థలను కూడా స్థిరంగా, సురక్షితంగా ఉంచాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

**స్థానిక కరెన్సీల్లో వాణిజ్యానికి ప్రోత్సాహం**

బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను మరింత సులభతరం చేయడంపై సదస్సులో దృష్టి పెట్టారు. స్థానిక కరెన్సీల వినియోగాన్ని పెంచడం, సరిహద్దు చెల్లింపుల వ్యవస్థలను బలోపేతం చేయడం, బ్రిక్స్ పేమెంట్ టాస్క్‌ఫోర్స్ ద్వారా జాతీయ చెల్లింపు వ్యవస్థల అనుసంధానంపై కసరత్తు కొనసాగించాలని నిర్ణయించారు. బ్రిక్స్ కరెన్సీని ఏర్పాటు చేయడం కంటే ప్రస్తుతం ఆచరణాత్మక ఆర్థిక సహకారంపైనే దృష్టి పెట్టినట్లు డిక్లరేషన్ స్పష్టం చేసింది.

**ఏఐపై ప్రత్యేక దృష్టి**

కృత్రిమ మేధస్సు వినియోగం కూడా సదస్సులో కీలక అంశంగా మారింది. గ్లోబల్ సౌత్ దేశాల అవసరాలకు అనుగుణంగా సురక్షితమైన, సమ్మిళిత, బాధ్యతాయుతమైన ఏఐ అభివృద్ధికి సభ్యదేశాలు మద్దతు ప్రకటించాయి. భారత్ చేపట్టిన ఏఐ సంబంధిత కార్యక్రమాలను డిక్లరేషన్‌లో ప్రస్తావించారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్మార్ట్ తయారీ, ఆరోగ్య రంగాల్లో సాంకేతిక సహకారాన్ని పెంచే చర్యలను కూడా భారత్ అధ్యక్షతన ముందుకు తీసుకెళ్లారు.

**ప్రపంచ సమస్యలపై ఉమ్మడి వైఖరి**

మధ్యప్రాచ్య సంక్షోభం, సూడాన్ పరిణామాలు వంటి అంతర్జాతీయ అంశాలపై బ్రిక్స్ దేశాలు ఉమ్మడి వైఖరిని వ్యక్తం చేశాయి. ఉద్రిక్తతలు తగ్గించేందుకు దౌత్యపరమైన పరిష్కారాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చాయి. ఏకపక్ష ఆంక్షలు,
వాణిజ్య అవరోధాలపై కూడా ఆందోళన వ్యక్తం చేశాయి. భిన్నమైన భౌగోళిక, రాజకీయ ప్రయోజనాలున్న దేశాల మధ్య ఈ స్థాయి ఏకాభిప్రాయం సాధించడం సదస్సు కీలక ఫలితాల్లో ఒకటిగా నిలిచింది.

**భారత్-చైనా సంబంధాలపైనా చర్చ**

సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక సమావేశం జరిగింది. ఇరు దేశాల మధ్య వ్యాపార, రవాణా సంబంధాలను మెరుగుపరచడంతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించడంపై చర్చించారు. ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడాలంటే సరిహద్దుల్లో శాంతి కీలకమని మోదీ స్పష్టం చేశారు.

**బ్రిక్స్ నుంచి ఇక కార్యాచరణ**

బ్రిక్స్ కూటమి విస్తరిస్తున్న కొద్దీ దాని బాధ్యతలు కూడా పెరుగుతున్నాయని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాల పాత్రను పెంచడం, ప్రపంచ దక్షిణ దేశాలకు మరింత ప్రాతినిధ్యం కల్పించడం, అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు తీసుకురావడం వంటి అంశాల్లో బ్రిక్స్ కీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే కార్యక్రమాలుగా నిర్ణయాలను మార్చాల్సిన సమయం వచ్చిందని స్పష్టం చేశారు

# తెలంగాణ రక్షణ సేనలోకి నాగోబా ప్రధాన పూజారి

- అక్టోబర్‌లో ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభకు సన్నాహాలు
- ఆదివాసీలను పెద్ద సంఖ్యలో పార్టీలోకి తీసుకురావడంపై దృష్టి

**హైదరాబాద్, సెప్టెంబర్ 14:**

కేస్లాపూర్ నాగోబా దేవాలయ ప్రధాన పూజారి, మేస్రం వంశీయుల పెద్ద మేస్రం ఆనందరావు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు సర్పంచులు, నాయకులు పార్టీలో చేరారు. తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ చేరికతో ఆదివాసీ ప్రాంతాల్లో పార్టీకి మరింత బలం చేకూరుతుందని నాయకులు పేర్కొన్నారు.

**నాగోబాతో కవితకు అనుబంధం**

నాగోబా దేవాలయంతో కల్వకుంట్ల కవితకు ప్రత్యేక అనుబంధం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ ఆమె నాగోబా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నాయి.



ఆలయ ప్రధాన పూజారి మేస్రం ఆనందరావు పార్టీలో చేరడం తమ శ్రేణులకు మరింత ఉత్సాహాన్నిచ్చిందని నాయకులు తెలిపారు.

**విస్తరణకు వరుస సభలు**

మేస్రం ఆనందరావుతో పాటు గిన్నెర సర్పంచ్ మేస్రం భీమ్‌రావు, ముత్తనూరు సర్పంచ్ రిట్టె విఠల్, ఆసోద సర్పంచ్ నగేశ్, మన్నూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు కాట్లె మనోహర్ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, పార్టీ సీనియర్ నాయకుడు లోకిని రాజు పాల్గొన్నారు. పార్టీ విస్తరణలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బహిరంగ సభలు నిర్వహించేందుకు తెలంగాణ రక్షణ సేన ప్రణాళిక రూపొందిస్తోంది. ఇటీవల నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభ విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగిందని నాయకులు తెలిపారు. ఈ నెల 20న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో మరో పాంచజన్య సంకల్ప సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఇంద్రవెల్లిలో భారీ సభ**

అక్టోబర్‌లో ఇంద్రవెల్లి కేంద్రంగా భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కల్వకుంట్ల కవిత వ్యూహరచన చేస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు జగిత్యాల జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులకు మరింత ఉత్సాహం కల్పించడమే లక్ష్యంగా సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి. ఆదివాసీలు, ముఖ్యంగా గోండులు, బంజారాలను పెద్ద ఎత్తున పార్టీలో చేర్చుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపాయి. కోస్గి సభ అనంతరం ఇంద్రవెల్లి సభ తేదీని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని నాయకులు తెలిపారు. పార్టీ విస్తరణలో ఈ సభ కీలక ఘట్టంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# 11 రోజుల దర్యాప్తు.. నీడల వెంట పోలీసులు

- * అనుమానాస్పద నీడలకూ మ్యాపింగ్.. చివరకు మల్లేష్‌పై ఫోకస్
- * రెండు రోజుల పాటు నిరంతరం నైట్ ఫుటేజ్ పరిశీలన
- * 12 తుపాకులు, 2 వేల బుల్లెట్లు, నైట్ విజన్ బైనాక్యులర్ స్వాధీనం
- * మల్లేష్‌పై ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 14:**

బొల్లారం మిలటరీ మద్రాస్ రెజిమెంట్‌కు చెందిన ఆయుధాల చోరీ కేసు దర్యాప్తు 11 రోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగింది. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు మిలటరీ అధికారులు, రాష్ట్రంలోని వివిధ పోలీసు విభాగాలు, కేంద్ర దర్యాప్తు సంస్థలు సమన్వయంతో ఆధారాలను సేకరించాయి. సీసీ కెమెరాల ఫుటేజ్ నుంచి కీలక ఆధారాలను వెలికితీసిన పోలీసులు చివరకు మాజీ సైనిక ఉద్యోగి మల్లేష్‌ను అనుమానితుడిగా గుర్తించి కేసు మిస్టరీని ఛేదించారు.

**నీడలపై కూడా నిఘా**

దర్యాప్తులో భాగంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు సుమారు 500 సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించారు. 29, 30వ తేదీ రాత్రులకు సంబంధించిన దృశ్యాలను సెకన్ టు సెకన్ విశ్లేషించారు. రాత్రి వేళ లైట్ల వెలుతురులో కనిపించిన అనుమానాస్పద నీడలను సైతం వదిలిపెట్టకుండా పరిశీలించారు. దాదాపు 20 నుంచి 30 వరకు నీడలను గుర్తించి వాటి కదలికలను మ్యాప్ చేశారు. అనంతరం అవి మనుషుల నీడలు కాకుండా ఇతర వస్తువులకు సంబంధించినవిగా నిర్ధారించారు. సీసీ కెమెరాల నుంచి లభించిన ఆధారాలను సమయాల వారీగా మ్యాప్ చేస్తూ పోలీసులు అనుమానితుల కదలికలను సరిపోల్చారు. ఈ క్రమంలో మాజీ సైనిక ఉద్యోగి మల్లేష్‌పై దృష్టి సారించి అతని కదలికలను నిశితంగా పరిశీలించారు. ఒక రాత్రికి సంబంధించిన ఫుటేజ్‌ను విశ్లేషించేందుకు అధికారులు రెండు రోజుల పాటు నిరంతరంగా వీడియోలను పరిశీలించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

**ఆర్మ్స్ యాక్ట్ కింద మరో కేసు**

బొల్లారం మిలటరీ ఆయుధాలు మాయమైన ఘటనపై తొలుత బొల్లారం పోలీసులు చోరీ కేసు నమోదు చేశారు. మల్లేష్ అరెస్టు అనంతరం దర్యాప్తులో వెలుగుచూసిన ఆధారాల ఆధారంగా అతనిపై ఆర్మ్స్ యాక్ట్ కింద కూడా అభియోగాలు నమోదు చేశారు. అతని నుంచి 12 తుపాకులు, 2 వేల బుల్లెట్లు, నైట్ విజన్ బైనాక్యులర్, మ్యాగజైన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆయుధాలను కోర్టుకు సమర్పించనున్నారు.

**ఇంకా ఏదైనా కుట్ర ఉందా?**

ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న మల్లేష్‌ను మరోసారి పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఆయుధాలు మాయమైన ఘటన వెనుక మరెవరైనా ఉన్నారా? ఇంకేమైనా కుట్ర జరిగిందా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగించనున్నారు. ఆయుధాల చోరీ మిస్టరీని ఛేదించేందుకు వివిధ దర్యాప్తు విభాగాలు సమన్వయంతో 11 రోజుల పాటు సాగించిన విచారణ పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# మర జవాన్లకు ఘన నివాళి

- ట్యాంక్‌బండ్‌లో తెలంగాణ విమోచన కమిటీ కార్యక్రమం
- చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత
- ఆపరేషన్ పోలో మాజీ సైనికులకు సన్మానం

**హైదరాబాద్, సెప్టెంబర్ 14:**

ఆపరేషన్ పోలోలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లకు తెలంగాణ విమోచన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్‌బండ్‌లోని యుద్ధ ట్యాంక్ వద్ద ఘన నివాళులర్పించారు. 1948 సెప్టెంబర్ 13న సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆదేశాలతో మేజర్ జనరల్ జె.ఎన్. చౌధురి నాయకత్వంలో ఆపరేషన్ పోలో ప్రారంభమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తెలిపారు. తెలంగాణ ప్రజల పోరాటం, సర్దార్ పటేల్ చొరవతో సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించిందన్నారు.

**చరిత్రను భావితరాలకు అందించాలి**



విమోచన చరిత్రను రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఎంపీ కె.లక్ష్మణ్ విమర్శించారు. ఈ చరిత్రను రాజకీయాలకు అతీతంగా భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. వీరభైరాన్‌పల్లి, అప్పంపల్లి వంటి ప్రాంతాల్లో అమరులైన వారి త్యాగాలు చిరస్మరణీయమని విమోచన కమిటీ చైర్మన్ బూర నర్సయ్య గౌడ్ పేర్కొన్నారు. ఈ చరిత్రను భావితరాలకు చాటి చెప్పడమే కమిటీ లక్ష్యమని కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆపరేషన్ పోలోలో సేవలందించిన రిటైర్డ్ ఆర్మీ జవాన్లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ సైనికులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖమ్మంలో జనసేన శంఖారావం



- * యువత, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలపై దృష్టి
- * గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణం బలోపేతం
- * రాష్ట్రవ్యాప్తంగా శంఖారావం సభలకు ప్రణాళిక
- * ఎన్నికలకు సమాయత్తమవుతున్న జనసేన శ్రేణులు

**ఖమ్మం, సెప్టెంబర్ 13:**

జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జనసేన తెలంగాణ శంఖారావం' సభ ఖమ్మంలోని ఎంబీ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో ప్రారంభమైంది. 'పద్మశ్రీ వనజీవి రామయ్య ప్రాంగణం' వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు హాజరయ్యారు. పార్టీ జెండాలు, నినాదాలతో సభా ప్రాంగణం సందడిగా మారింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, జనసేన అధికార ప్రతినిధి డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ జరిగింది.

**భారీ బైక్ ర్యాలీ**

సభకు ముందు ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి ఎంబీ ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బైపాస్ రోడ్ మీదుగా సాగిన ర్యాలీలో జనసేన నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు. పార్టీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

**పార్టీ బలోపేతంపై దృష్టి**

తెలంగాణలో జనసేన విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు నాయకులు తెలిపారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలను ప్రధానంగా తీసుకుని ప్రజల్లోకి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

**శంఖారావం సభలతో విస్తరణ**

గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని నాయకులు వెల్లడించారు. ప్రజా సమస్యలపై పోరాటమే జనసేన లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణవ్యాప్తంగా నిర్వహించే శంఖారావం సభలు పార్టీ బలోపేతానికి వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఖమ్మం సభతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వచ్చిందని, రాబోయే ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తమవుతున్నారని తెలిపారు. సభకు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్, రాధారం రాజలింగం, తనీష్ అల్లాడి తదితరులు హాజరయ్యారు.

# లక్కీ డ్రా ఇళ్లపై క్లారిటీ



- 6,660 మంది అభ్యర్థుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి
- మిగిలిన వారి పరిశీలన ఈ వారంలోనే పూర్తి
- అర్హులకు త్వరలో అధికారిక కేటాయింపు పత్రాలు
- బ్రోకర్లు, మధ్యవర్తులను నమ్మొద్దని హెచ్చరిక
- లంచాలు, కమీషన్లు చెల్లించొద్దని సూచన
- అధికారిక ఖాతాల్లోనే తొలి విడత చెల్లింపులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 13:**

ఇందిరమ్మ టవర్స్ ఎల్ఐజీ గృహాల లక్కీ డ్రాలో ఎంపికైన అభ్యర్థుల్లో ఇప్పటివరకు 6,660 మంది క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిందని తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వీపీ గౌతమ్ తెలిపారు. మిగిలిన అభ్యర్థుల పరిశీలనను కూడా ఈ వారంలోనే పూర్తి చేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులుగా తేలిన వారికి అధికారిక కేటాయింపు పత్రాలు జారీ చేస్తామని వెల్లడించారు.

**లక్కీ డ్రాలో ఎంపికైన వారికి భరోసా**

ఇల్లు కేటాయిస్తారా లేదా అన్న ఆందోళనకు లక్కీ డ్రాలో ఎంపికైన అభ్యర్థులు గురికావాల్సిన అవసరం లేదని గౌతమ్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన, అర్హత నిర్ధారణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతోందని తెలిపారు.

**బ్రోకర్ల మాటలు నమ్మొద్దు**

గృహాల కేటాయింపు ప్రక్రియను ఆసరాగా చేసుకుని కొందరు బ్రోకర్లు, మధ్యవర్తులు డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని గౌతమ్ పేర్కొన్నారు. ఇల్లు మంజూరు చేయిస్తామని, అధికారులతో మాట్లాడి సహాయం చేస్తామని చెబుతున్న వ్యక్తులకు ఎలాంటి లంచం, కమీషన్ లేదా ఇతర రూపంలో డబ్బులు చెల్లించవద్దని లబ్ధిదారులకు సూచించారు.

**తొలి విడత చెల్లింపులపై స్పష్టత**

గృహానికి సంబంధించిన తొలి విడత మొత్తాన్ని చెల్లించాల్సిన అధికారిక బ్యాంకు ఖాతా, చెల్లించాల్సిన మొత్తం, గడువు, ఇతర సూచనలను కేటాయింపు పత్రంతోపాటే తెలియజేస్తామని తెలిపారు. కేటాయింపు పత్రంలో పేర్కొన్న అధికారిక బ్యాంకు ఖాతాకు మాత్రమే నిర్ణీత మొత్తాన్ని చెల్లించాలని సూచించారు. అధికారిక సమాచారం కోసం తెలంగాణ హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్ tghb.telangana.gov.inను సందర్శించడంతోపాటు, 040 24603572 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని గౌతమ్ తెలిపారు.

# మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.



**మెదక్ సెప్టెంబర్,13(సిరి న్యూస్)**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా ప్రజలందరికీ, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వినాయక చవితిని ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షిద్దామని పిలుపునిచ్చారు. ప్రకృతిని కాపాడే బాధ్యతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.విఘ్నేశ్వరుడి కృపతో మెదక్ జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

# జిల్లా ప్రజలందరికి వినాయక చవితి శుభాకాంక్షలు

- మట్టి గణపతినే పూజిద్దాం. పర్యావరణాన్ని కాపాడుదాం.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**మెదక్ సెప్టెంబర్,13(సిరిన్యూస్)**

గణేష్ చతుర్థి సందర్భంగా జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ ప్రతిమాసింగ్ శుభాకాంక్షలు తెలిపారు.

విగ్నేశ్వరుని కృపతో విఘ్నాలన్ని తొలగి, అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. జిల్లాలో ప్రజలందరూ ఈ పండుగను సంతోషంగా,భక్తి భావంతో జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ... గణపతి ఆశీర్వాదాలతో జిల్లాలో ప్రతి ఒక్కరికి సుఖ సంతోషాలు, శాంతి, ఆర్థిక స్థితి మెరుగుపడాలని ఆకాంక్షించారు. పర్యావరణ రక్షణ కోసం మట్టి గణేష్ విగ్రహాలను వినియోగించుకోవాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను నిషేధించి, నీటి కాలుష్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గణేష్ విగ్రహాల నిమజ్జనం సమయంలో స్వచ్ఛత, క్రమశిక్షణ పాటించాలని, ప్రభుత్వానికి సహకరించాలని ప్రజలను కోరారు. నిమజ్జనానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతాల్లోనే నిమజ్జనం చేయాలని ప్రజలకు తెలిపారు. ప్రజలందరూ ఐకమత్యంతో, ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కలెక్టర్ తెలిపారు.

# విఘ్నాలకు అధిపతి వినాయకుడు

- రాష్ట్ర ప్రజలందరికి వినాయక చవితి శుభాకాంక్షలు.
- శేరి సుభాష్ రెడ్డి
- మాజీ ఎమ్మెల్సీ.



**మెదక్ సెప్టెంబర్,13(సిరి న్యూస్)**

విఘ్నాలను తొలగించి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాన్ని ప్రసాదించే వినాయకుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి అన్నారు . వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని తెలిపారు.వినాయకుని కృపతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యం,అభివృద్ధి వెల్లివిరియాలని మన స్ఫూర్తిగా ప్రార్థిస్తూ... రాష్ట్ర ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# పీఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణేష్ మండపం ఏర్పాటు



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 13 (సిరి న్యూస్):**

స్థానిక కనుకుంట యూత్ సభ్యుల విజ్ఞప్తి మేరకు రామచంద్రాపురం డివిజన్‌లోని కనుకుంటలో పీఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.లక్ష వ్యయంతో గణేష్ మండపాన్ని ఏర్పాటు చేశారు. లింగంపల్లి పోలీస్ క్వార్టర్స్ పక్కన ఏర్పాటు చేసిన ఈ మండపాన్ని తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం స్థానిక నాయకులు, యూత్ సభ్యులు, బస్తీ వాసులతో కలిసి పుష్పనగేష్ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్ట్రీట్ లైట్లు, పారిశుద్ధ్యం, పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా భోదన జరగాలి





- సరోజినిదేవి ఆసుపత్రి రిటైర్డ్ సూపరిండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్
- జోగిపేటలో లయన్స్ క్వెస్ట్ టీచర్స్ శిక్షణ ముగింపు కార్యక్రమం

**జోగిపేట, సెప్టెంబర్ 13, (సిరి న్యూస్):**

వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు పాఠాలు బోధించాలని అందుకే లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్వెస్ట్ టీచర్స్‌కు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మాజీ లయన్స్ క్లబ్ గవర్నర్, సరోజినిదేవి ఆసుపత్రి రిటైర్డ్ సూపరిండెంట్ డాక్టర్ ఎస్.రవీందర్ గౌడ్ అన్నారు. ఆదివారం జోగిపేటలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో లయన్స్ క్వెస్ట్ ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. విద్యార్థులను టార్గెట్ చేసి డ్రగ్స్‌ను విక్రయాలు జరుగుతున్నాయని, విద్యార్థులు అటువైపు ఆకర్షితులు కాకుండా వారి భవిష్యత్తుపై దృష్టి పెట్టేలా చూడాల్సిన భాద్యత ఉపాధ్యాయులదేనని రాష్ట్రంలో సినిమా యాక్టర్లు, క్రీడాకారులు డ్రగ్స్ వినియోగిస్తూ పట్టుబడ్డా నామమాత్రపు చర్యలు తీసుకోవడంతో అడ్డు అదుపు లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వాలు డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందన్నారు. లయన్స్‌క్లబ్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న విషయాన్ని వివరించారు.

**ఉపాధ్యాయులకు సర్టిఫికెట్ల పంపిణీ**

రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నా ఉపాధ్యాయులకు మాజీ లయన్స్‌క్లబ్ గవర్నర్ డాక్టర్ ఎస్.రవీందర్‌గౌడ్ శాలువా, సర్టిఫికెట్లతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి డిస్టిక్ క్వెస్ట్ కోఆర్డినేటర్ వి. వెంకటరమణ రాజు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ రామ్మనోహర్ సౌభాగ్య, డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ కే. అనంతరెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ ఆకుల రాంబాబు, పద్మనాభరెడ్డి, క్వెస్ట్ నేషనల్ ట్రైనర్స్ డాక్టర్ లక్ష్మీ మూర్తి, క్లబ్ అధ్యక్ష, కోశాధికారి జి.ఆర్. మధుసూదన్ రెడ్డి, జి. సంతోష్, సభ్యులు కొత్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 17 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణకు కృషి

- ఉచితంగా మట్టి గణపతుల పంపిణీ
- తూప్రాన్ సూర్య మెడికల్ అధినేత బొడ్డు రమ్య శ్రీహరి సేవలు అభినందనీయం

**తూప్రాన్ సెప్టెంబర్ 13 సిరి న్యూస్**



తూప్రాన్ మున్సిపల్ పట్టణంలో సూర్య మెడికల్ నిర్వాహకుడు ప్రతి సంవత్సరం మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు వినాయక చవితి అంటేనే భక్తి పర్యావరణం కలగలిసిన పండుగ అయితే రంగు విగ్రహాలు వద్దు మట్టి విగ్రహాలని మన గ్రామంలో పూజితం రంగు విగ్రహాలతో చెరువులు కలుషితమవుతున్న తరుణంలో తూప్రాన్ పట్టణంలో గత 17 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న కృషి మట్టి గణపతులను తయారు చేయించి ప్రజలకు ప్రతి ఏటా వినాయక చవితికి ముందు వందలాది మట్టి విగ్రహాలను తెప్పించి తూప్రాన్ ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా బొడ్డు రమ్య శ్రీహరి మాట్లాడుతూ వ్యాపారం మాత్రమే కాదు సామాజిక బాధ్యత కూడా ముఖ్యం మట్టి గణపతులను పూజిస్తే మట్టిలోనే కలిసిపోయి పర్యావరణానికి ఎలాంటి హాని జరగదు భావి తరాలకు స్వచ్ఛమైన చెరువులను అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రతి వినాయక చవితికి కొనసాగిస్తున్నామని తెలిపారు

# ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులుగా మంగపూర్ రమేష్ నియామకం

- ప్రధాన కార్యదర్శిగా వేణు మాదిగ

**నర్సాపూర్ సెప్టెంబర్ 13 (సిరి న్యూస్)**

ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం దుర్గ దాస్ మాదిగ ఆధ్వర్యంలో ఆదివారం నర్సాపూర్ పట్టణంలో జరిగింది

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ జిల్లా ఇన్చార్జి బొజ్జ సైదులు మాదిగ పాల్గొన్నారు వారు మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశం మేరకు కుల లింగ వర్ణ మార్పు కై మరో పోరాడడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు అక్టోబర్ 7 తేదీన అమరావతిలో జరగబోయే ఎమ్మార్పీఎస్ మండల జాతీయ మాహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఆదివారం నర్సాపూర్ మండలం నూతన కమిటీ ఎన్నుకున్నారు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంగపూర్ రమేష్ మాదిగను నియమించారు

**అధికార ప్రతినిధిగా మీసాల కృష్ణమాదిగ**

ప్రధాన కార్యదర్శిగా వేణు మాదిగ ప్రధాన కార్యదర్శిగా కట్ల రాజు మాదిగ ఉపాధ్యక్షులు బోడ శ్రీకాంత్ మాదిగ చాగంటి శ్రీనివాస్ మాదిగ మన్ని సత్తయ్య మాదిగ కోశాధికారి కిష్టని నవీన్ మాదిగ కార్యదర్శులు కృష్ణమాదిగ అశోక్ మాదిగ బోడ వెంకటేష్



మాదిగ జాజుల బిక్షపతి మాదిగ సహాయ కార్యదర్శులు అబ్బుగారి రాజు మాదిగ కట నవీన్ మాదిగ కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నీరుడు సత్యనారాయణ మాదిగ కృష్ణని సాయిలు మాదిగ వెంకట్ సందీప్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గణేష్ మండపం షెడ్





- నూతన షెడ్‌ను ప్రారంభించిన శశికళ యాదవ రెడ్డి, పుష్పనగేష్

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 13 (సిరి న్యూస్):**

రామచంద్రాపురం డివిజన్‌లోని రామచంద్రారెడ్డి నగర్‌లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెన్నవరం మల్లారెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.6 లక్షలతో నూతన గణేష్ మండపం షెడ్‌ను నిర్మించారు. తన తల్లిదండ్రులు కీర్తిశేషులు వెన్నవరం నరసింహారెడ్డి, లక్ష్మినరసమ్మ (మాజీ సర్పంచ్, రామచంద్రాపురం) జ్ఞాపకార్థం ఈ షెడ్‌ను నిర్మించినట్లు తెలిపారు. కాలనీ అధ్యక్షుడి ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు శశికళ యాదవ రెడ్డి, రామచంద్రాపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన గణేష్ మండపం షెడ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులతో పర్యావరణ పరిరక్షణ!!

- మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ!!
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**శివంపేట్ సెప్టెంబర్ 13 ( సిరి న్యూస్ )**



వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా శివ్వంపేట బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిగుళ్లపల్లి శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మట్టి వినాయకుల ప్రతిమలను పూజించడం ద్వారా భక్తిభావంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా చేయూతనిచ్చిన వారమవుతామని అన్నారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణ గౌడ్, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, జెడ్పి కోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, ఉప సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు పవన్ గుప్తా, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు నాగేశ్వర రావు, బీఆర్ఎస్ నాయకులు యాదగౌడ్, సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బుద్దుల బిక్షపతి, జగన్ రెడ్డి, వారాల శ్యామ్, కైఫ్, వంజరి రాహుల్, శ్రీకాంత్ రెడ్డి, పిట్ల కృష్ణ, మంగలి రమేష్, సుకుమార్, జంగం స్వామి, ముత్యాలు, గ్రామస్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రసిద్ధ దర్శకుడు సుకుమార్ ను కలిసిన గీతం అధ్యాపకుడు



- పరిశోధనా ప్రతుల సమర్పణ
- సుకుమార్ పుస్తకానికి ముందుమాట

**పటాన్ చెరు, సెప్టెంబర్ 13, (సిరి న్యూస్)**

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డాక్టర్ జె.డి. ప్రభాకర్, ప్రఖ్యాత భారతీయ చిత్ర నిర్మాత, దర్శకుడు, కథా సంభాషణల రచయిత సుకుమార్ ను ఇటీవల కలిశారు. దేశీయ భాషల సామాజికఆర్థిక ప్రాముఖ్యతను, సుస్థిర జాతీయాభివృద్ధిలో వాటి పాత్రను వివరిస్తూ తాను చేసిన పరిశోధనను ఆయనకు అందజేశారు.

డాక్టర్ ప్రభాకర్ తన మూడు రచనలైన 'సోషియో ఎకనామిక్ ప్రొఫైలింగ్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్', 'ఇండిజినస్ లాంగ్వేజెస్ యాజ్ ఇంజిన్స్ ఆఫ్ ఎకనామిక్ డెవలప్ మెంట్', 'లాంగ్వేజ్ (ఆర్థిక వ్యవస్థ - భాష)'లను సుకుమార్ కు ఇచ్చారు. ఉపాధి, ఆర్థిక సమ్మిళతం, జాతీయాభివృద్ధికి దోహదపడగల వాటి సామర్థ్యాన్ని ప్రదర్శించడం ద్వారా, మాతృభాషా ఆధారిత విద్యతో సహా దేశీయ భాషలను బలోపేతం చేయాలని ఆయన పరిశోధన వాదిస్తుంది. డాక్టర్ ప్రభాకర్ కృషి హైడెల్ బర్గ్ విశ్వవిద్యాలయం, లండన్ విశ్వవిద్యాలయం, హంబోల్ట్ విశ్వవిద్యాలయం తో సహా ప్రతిష్టాత్మక అంతర్జాతీయ విద్యా సేకరణ లలో నమోదు కావడం ద్వారా గుర్తింపు పొందింది. దృశ్య కథనం, కథన నిర్మాణం, కథా సంభాషణలలో (స్క్రీన్ రైటింగ్) సుకుమార్ విలక్షణమైన విధానాన్ని పరిశీలించే ఒక పాండిత్య గ్రంథమైన, డాక్టర్ ప్రవీణ్ యజ్జల రచించిన 'స్క్రీన్ ప్లే రైటర్ మాస్టర్ సుకుమార్' పుస్తకానికి డాక్టర్ ప్రభాకర్ ముందు మాటను కూడా రాశారు. సాంస్కృతిక పురోగతి, ఆర్థిక సాధికారత, జాతీయ అభివృద్ధికి కీలకమైన ఆస్తులుగా ఉన్న భారతీయ భాషలను పరిరక్షించడం, ప్రోత్సహించడంపై విద్యావేత్తలకు, సినిమా రంగానికి ఈ సమావేశం ఒక ఉమ్మడి చర్చకు వేదికగా నిలిచింది.

# డీజిల్, పెట్రోల్ సొంత వాహనాలకు వాడడం లేదు

- సోషల్ మీడియాలో దుష్ప్రచారం నమ్మొద్దు
- మున్సిపల్ కమిషనర్ సాయికుమార్

**నర్సాపూర్ సెప్టెంబర్ 13 (సిరి న్యూస్)**

పురపాలక సంఘం యొక్క వాహనాలకు వాడవలసిన డీజిల్, పెట్రోల్ కార్యాలయ అధికారులు పాలకవర్గ సభ్యులు వారి సొంత వాహనాలకు వాడుతూ దుర్వినియోగం చేస్తున్నారని కొంతమంది సోషల్ మీడియాలో దుష్ప్రచారము చేస్తున్నారని.ఇది పూర్తిగా అవాస్తవము అని ఎటువంటి దుర్వినియోగం జరగడం లేదు. కేవలం పురపాలక వాహనాలలో మాత్రమే నిబంధనల మేరకు పెట్రోల్, డీజిల్ వినియోగించడం జరుగుతున్నది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరములు కార్యాలయం నందు అందుబాటులో ఉన్నదని కావున ఎటువంటి దుష్ప్రచారాలని నమ్మవద్దని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ సాయి కుమార్ ప్రకటలో తెలిపారు

# రంగు విగ్రహాలు వద్దు మట్టి గణపతి విగ్రహాలే మొక్షం



**తూప్రాన్ సెప్టెంబర్ 13 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పట్టణ పరిధిలోని అక్షర స్కూల్ లో విద్యార్థులు మట్టి వినాయకుని తయారుచేసి పర్యావరణాన్ని కాపాడడం కోసం మట్టి వినాయకుడిని వాడాలని రంగు విగ్రహాలు వాడడం వలన నీరు వాతావరణం కలుషితమై ప్రాణాంతకమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుందని అందువలన మట్టి విగ్రహాలను వాడాలి అని సందేశం ఇచ్చారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉదయశ్రీ విద్యార్థుల్ని అభినందించారు కార్యక్రమంలో పాఠశాల యజమాన్యం ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు

# లంబోదరుడి సేవలో వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి..



- సొంత ఖర్చుతో అద్భుత మండప ఏర్పాటు
- ప్రజా సేవలోనే దైవ సేవ... భక్తుల హర్షం

**జిన్నారం సెప్టెంబర్ 13 సిరి న్యూస్**

జిన్నారం పురపాలిక పరిధిలోని రెండవ వార్డ్ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవడానికి ఎలాంటి ఆర్థిక భారం, చందాలు, వసూలు పడకూడదనే, ఉద్దేశంతోనే సొంత నిధులతో మండపాన్ని ఏర్పాటు చేసి వార్డు ప్రజలకు అంకితం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ... దేవుడి ఉత్సవాల పేరిట సామాన్య నిరుపేద ప్రజలపై ఒక్క రూపాయి కూడా చందాల భారం పడకూడదని ఉద్దేశంతోనే ఈ మండపాన్ని నా సొంత నిధులతో ఏర్పాటు చేసి రెండో వార్డు ప్రజలకు అంకితం చేస్తున్నాను అని తెలిపారు. పదవి అనేది కేవలం పరిపాలనకే కాదు ప్రజల ఆనందంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వామి కావడానికే నని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, గాండ్ల శ్రీనివాస్ ముదిరాజ్, వినోద్, సుధాకర్, లక్ష్మణ్ యాదగిరి బాబు భాస్కర్ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి.

- సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్

**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 13, (సిరి న్యూస్):**



సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్ డిమాండ్ చేశారు. ఆదివారం పెద్ద శంకరంపేట లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో చేపట్టిన ఆపరేషన్ పోలో తెలంగాణ ప్రజల పోరాట ఫలితంగా హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనం కావడం జరిగిందని పేర్కొన్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని గుర్తు చేసుకుంటూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు ప్రభుత్వాలు తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించకపోవడం సిగ్గు చేటని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణ, బీజేవైఎం అధ్యక్షులు బుగుడాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న మండపాలు




**పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 13, (సిరి న్యూస్):**

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పెద్ద శంకరంపేట తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం వినాయక మండపాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో.. పలు ఆలయాలలో గ్రామాలలో వాడ వాడల పలు ప్రధాన ప్రాంతాలలో వినాయక మండపాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొత్త కొత్త సెట్టింగ్ లతో ఒకరికి మించి ఒకరు వినాయక మండపాలను విద్యుత్ దీపాలతో దేవత మూర్తుల సెట్టింగ్లతో ఎంతో అందంగా అలంకరిస్తున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించేందుకు ఆయా మండపాల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో ప్రజలు ఆయా మండపాలను దర్శించుకుని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు.

# శివ్వంపేటలో అకాల వర్షా నికి జర్నలిస్ట్ ఇల్లు ధ్వంసం

- పైకప్పు కూలి ఇంటి సామాగ్రి ధ్వంసం నిరాశ్రయులైన కుటుంబం
- ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

**శివ్వంపేట సెప్టెంబర్ 13 ( సిరి న్యూస్ )**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. స్థానికంగా నివాసం ఉంటున్న జర్నలిస్ట్ సంపత్ కుమార్,ఇల్లు ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ధ్వంసమైంది.

భారీ వర్షం కారణంగా ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న బట్టలు, నిత్యావసర సరుకులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర గృహోపకరణాలు పూర్తిగా తడిసి ధ్వంసమయ్యాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనతో జర్నలిస్ట్ సంపత్ కుమార్ కుటుంబం ఒక్కసారిగా నిరాశ్రయులైంది. నివాసం ఉండేందుకు స్థలం లేక కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. జరిగిన నష్టంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.విషయం తెలుసుకున్న స్థానికులు, తోటి జర్నలిస్టులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వం ద్వారా తగిన పరిహారం అందించి జర్నలిస్ట్ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు, జర్నలిస్టులు కోరుతున్నారు.

# కాంగ్రెస్ పాలనపై టిఆర్ఎస్ నాయకుల బగ్గు బగ్గు నేతల ధ్వజం

- ఎమ్మెల్యేలపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండించిన పుర్రె ప్రభాకర్, నీరుడి లక్ష్మణ్

**కొల్చారం, సెప్టెంబర్ 13 (సిరి న్యూస్)**



మండల కేంద్రమైన కొల్చారంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో నాయకులు పుర్రె ప్రభాకర్, నీరుడి లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో పోలీసులు వారితో నెట్టులాటకు దిగడం దుర్మార్గమని వారు అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేలపై, పోలీసుల దౌర్జన్యంపై ప్రశ్నిస్తూ చేసినవేనని, స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని తెలిపారు. దమ్ముంటే స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు హోంశాఖ బాధ్యతలు అప్పగించి దళితులపై కాంగ్రెస్‌కు ఉన్న ప్రేమను నిరూపించుకోవాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల హామీలతో అధికారంలోకి వచ్చి, ఇప్పటివరకు ప్రకటించిన సంక్షేమ పథకాల్లో అనేక హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులు గడిచినా పరిస్థితిలో మార్పు లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో మాజీ సీఎం కేసీఆర్ కీలక పాత్ర పోషించారని, తెలంగాణ కోసం ఆయన ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి కేంద్రంతో పోరాడారని పేర్కొన్నారు. కేసీఆర్ అసెంబ్లీ ఎదుట అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినప్పటికీ కాంగ్రెస్ నాయకులు ఆ విగ్రహానికి కనీసం నివాళులు అర్పించలేదని ఆరోపించారు. దళితుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం మూడు ఎకరాల భూమి, దళితబంధు వంటి పథకాలను తీసుకొచ్చిందని గుర్తుచేశారు. పార్లమెంట్‌కు రాహుల్ గాంధీ నల్ల టీషర్ట్ ధరించి వెళ్లిన సందర్భాలను ప్రస్తావిస్తూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళితే తప్పేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులం పేరుతో రాజకీయాలు చేస్తోందని వారు ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులతో దౌర్జన్యానికి పాల్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్చారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాంపల్లి గౌరీశంకర్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు నరేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యాగౌడ్, సర్పంచ్ యోహన్, కరెంట్ రాజాగౌడ్, గౌరీశంకర్, ధనరాజ్, చెన్నయ్య, చిన్న రాములు, పాండ్ర వెంకటేశం, శ్రీను, సాయిని సిద్ధిరాములు, కోరంపల్లి గోపి, గడ్డం యాదగిరి గౌరీశంకర్ మాజీ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మండల ప్రజలందరికి వినాయక చవితి శుభాకాంక్షలు

- మండల వ్యాపార సంఘాల అధ్యక్షుడు రమేష్ గుప్తా

**వెల్దుర్తి,సెప్టెంబర్,13(సిరి న్యూస్):**



విఘ్నాలను తొలగించి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాన్ని ప్రసాదించే వినాయకుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని వెల్దుర్తి మండల వ్యాపార వాణిజ్య సంస్థల అధ్యక్షుడు కొమిరిశెట్టి రమేష్ గుప్తా అన్నారు . వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని తెలిపారు.వినాయకుని కృపతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యం,అభివృద్ధి వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ.. అలాగే ఈ 11 రోజులు మండలంలోని అన్ని మండపాల వద్ద కార్యకర్తలు తగు జాగ్రత్తలు తీసుకొని భక్తిశ్రద్ధలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మండల ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# వినాయక ఉద్యోగుల సమస్యలు తీర్చండి.!

- టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్.

మెదక్ సెప్టెంబర్,13(సిరి న్యూస్)



జిల్లాలోని అన్ని వర్గాల ఉద్యోగులకు, అధికారులకు,విశ్రాంత ఉద్యోగులకు మరియు ప్రజలందరికీ టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ వినాయక చవితి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, డిఏలు, పిఆర్సి ఫిట్మెంట్, ఓ పి ఎస్, ఆరోగ్య కార్డులు తదితర అంశాలపై ఈనెల 18న ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో జరిపే చర్చలో సమస్యలన్నీ తీరే విధంగా వినాయకుడు ఆశీర్వదించాలని, లంబోదరుని కృపతో జిల్లాలోని వివిధ వర్గాల అన్ని రకాల విఘ్నాలు తొలగిపోవాలని, ప్రజలందరూ సుఖశాంతులతో కుటుంబ సభ్యులతో వినాయక చవితి పండుగ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. వినాయక నవరాత్రులు ఎటువంటి ఆటంకాలు లేకుండా సాగిపోవాలని ఘనంగా భక్తిశ్రద్ధలతో గణేశుడు పూజలందుకోవాలని ప్రార్థించారు.

# శంకర్ దాదాలపై టీజీఎంసీ కొరడా




- నానక్‌రాంగూడలో ఇంటర్, డిగ్రీతోనే వైద్యం
- తప్పుడు జ్వర రికార్డులతో చికిత్స చేసిన నిర్వాహకుడు
- ఎంబీబీఎస్‌తోనే జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ అవతారం
- ఫేక్ సర్టిఫికెట్లతో పీజీ వైద్యుడిగా ప్రచారం
- యూనానీ వైద్యులుగా ఉంటూ అల్లోపతి మందుల వినియోగం
- అనధికార వైద్యులపై క్రిమినల్ చర్యలకు టీజీఎంసీ సిద్ధం

హైదరాబాద్, సెప్టెంబర్ 14:

నానక్‌రాంగూడ, గోల్కొండ, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో అనధికారికంగా సాగుతున్న అల్లోపతి వైద్యం, క్వాకరీపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) కొరడా ఝుళిపించింది. ఆదివారం కౌన్సిల్ సభ్యులు డా. జి. శ్రీనివాస్, డా. వి. నరేష్ కుమార్, డా. కె.యు.ఎన్. విష్ణులతో కూడిన ప్రత్యేక బృందాలు పలు క్లినిక్‌లు, ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా అర్హతలు లేకుండా వైద్యం చేస్తున్న పలువురిని గుర్తించడంతోపాటు, నకిలీ ధ్రువపత్రాలతో స్పెషలిస్ట్ వైద్యులుగా చలామణి అవుతున్న వ్యవహారాలు వెలుగుచూశాయి.

### ఇంటర్ చదివి వైద్యం

నానక్‌రాంగూడలోని భాస్కర్ క్లినిక్‌లో నిర్వాహకుడు భాస్కర్ తన అర్హత బీఏ అని అధికారులకు తెలిపినట్లు టీజీఎంసీ పేర్కొంది. డా. అనిత పేరుతో బోర్డు ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్న అతడు..జ్వరం లేని రోగికి 101 డిగ్రీల జ్వరం ఉన్నట్లు రికార్డులు సృష్టించి చికిత్స అందిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సాయి గణేష్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో నారాయణ, మదర్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో దిలీప్ ఇంటర్మీడియట్ చదివి రోగులను అడ్మిట్ చేసుకుని అల్లోపతి మందులు ఇస్తున్నట్లు తేలింది. సాయి క్లినిక్‌లో బీఫార్మసీ చదివిన రాజశేఖర్ ఎలాంటి అనుమతులు లేకుండా మరో వైద్యుడి పేరుతో అల్లోపతి వైద్యం నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

### ఎంబీబీఎస్‌తో జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్

శేరిలింగంపల్లిలోని శ్రేయా హాస్పిటల్‌లో డా. పి. శరత్‌బాబు తన అర్హత ఎంబీబీఎస్ అని వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. అయితే ఆసుపత్రిలో ఎంఎస్ ఆర్థోపెడిక్ సర్జన్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్‌గా ప్రచారం చేసుకుంటూ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు గుర్తించారు. మెడికల్ కౌన్సిల్‌లో ఎంఎస్ ఆర్థోపెడిక్స్ రిజిస్ట్రేషన్ లేకపోవడంతోపాటు, పీజీ సర్జన్‌గా నమ్మించేందుకు అనుమానాస్పద ధ్రువపత్రాలు సమర్పించినట్లు అధికారులు గుర్తించారు. ఆసుపత్రి రికార్డులు, సర్జరీ వివరాలు, అనుమతులపై విచారణ కొనసాగుతోంది.

### యూనానీ వైద్యులుగా ఉంటూ అల్లోపతి

గోల్కొండలోని షిఫా క్లినిక్‌లో బీయూఎంఎస్ వైద్యుడు ఎం. షబ్బీర్ హుస్సేన్ హైపొటెన్సీ యాంటీబయాటిక్స్, కార్టికోస్టెరాయిడ్స్, ఐవీ ఫ్లూయిడ్స్, పెయిన్‌కిల్లర్లను చిన్నారులు, పెద్దలకు సూచిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. డ్రగ్ కంట్రోల్ అనుమతులు లేకుండా మందులను నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు తేలింది. రాజేంద్రనగర్‌లోని హెల్త్‌కేర్ హాస్పిటల్‌లో ఇంటర్మీడియట్ చదివిన ఫరూక్, బీయూఎంఎస్ చదివిన గజాలా అల్లోపతి ప్రిస్క్రిప్షన్లు రాస్తున్నట్లు గుర్తించారు.

### కఠిన చర్యలకు టీజీఎంసీ

అర్హతలు లేకుండా ఆధునిక వైద్యం చేయడం ప్రజారోగ్యానికి ప్రమాదకరమని టీజీఎంసీ సభ్యుడు డా. జి. శ్రీనివాస్ తెలిపారు. తనిఖీల్లో పట్టుబడిన వారిపై మెడికల్ ఎథిక్స్, చట్టపరమైన నిబంధనల ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రజలు కౌన్సిల్ గుర్తింపు పొందిన వైద్యుల వద్దే చికిత్స పొందాలని సూచించారు. అనధికారిక వైద్యులపై 9154382727 వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 13

కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ గ్రామాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ భుజంగరావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రోగ్రామ్ ప్రక్రియపై సంబంధిత అధికారులతో ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు. గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఏ తీరుగా సాగుతోందో సర్పంచ్ జమున మహేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు సేకరించారు. అనంతరం గ్రామానికి చెందిన బిఎల్ఓ లతో సమావేశమైన అడిషనల్ కలెక్టర్, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇంకా ఎన్ని నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయనే అంశంపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న నోటీసులన్నింటినీ ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను స్పష్టంగా ఆదేశించారు.

# మంచిర్యాలలో వైద్య సేవలకు కొత్త వెలుగు

- మంచిర్యాలలో తిరుపతి ఆసుపత్రి ప్రారంభం..
- తిరుపతి, శ్వేత దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు..
- ప్రముఖుల సమక్షంలో ఘన ప్రారంభోత్సవం..

మంచిర్యాల జిల్లా ప్రతినిధి
సెప్టెంబర్ 13 (సిరి న్యూస్)




మంచిర్యాల పట్టణంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన తిరుపతి ఆసుపత్రి ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. బెల్లంపల్లి నియోజకవర్గం తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ అల్లుడు వైద్యులు బండారి తిరుపతి, శ్వేత దంపతులు ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరికిపండ్ల నరహరి ఐఏఎస్ హాజరై రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ఆయనతో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, ఆసంపల్లి నర్సయ్య, ఓబీసీ జిల్లా సహ అధ్యక్షుడు బండి లక్ష్మణ్, యువజన కాంగ్రెస్ నాయకుడు మారపాక వంశీ తదితరులు పాల్గొన్నారు. మంచిర్యాల ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఆధునిక వైద్య సదుపాయాలతో మెరుగైన చికిత్స అందించేందుకు తిరుపతి ఆసుపత్రి ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసుపత్రి ప్రారంభంతో స్థానిక ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి..

# బీజేపీ ఎమ్మెల్యేల్లో ఎవరి దారి వారిదే!

- 22ఏపై పోరాటానికి మంచి మార్కులు.. ఇతర అంశాల్లో భిన్న వైఖరి
- సీఎంతో బ్రేక్‌ఫాస్ట్‌పై సొంత పార్టీ నుంచే విమర్శలు
- ప్రభుత్వాన్ని ప్రశంసిస్తున్న కొందరు ఎమ్మెల్యేలు
- సభ వ్యూహంపైనా ఏకాభిప్రాయం కుదరని పరిస్థితి
- డేటా సెంటర్లపై భిన్న స్వరాలు
- ట్రాక్టర్ ర్యాలీలోనూ కనిపించని సమన్వయం

హైదరాబాద్, సెప్టెంబరు 13:



తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యేల వ్యవహారశైలి ఇప్పుడు పార్టీలో చర్చకు దారితీస్తోంది. 22ఏ భూముల అంశంపై సభలో చర్చకు పట్టుబట్టడం, నిరసన వ్యక్తం చేయడంలో శాసనసభాపక్షం దూకుడు ప్రదర్శిస్తున్నా.. ఇతర అంశాల్లో మాత్రం ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కొరవడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకే అంశంపై ఒకే వైఖరితో ముందుకు సాగకుండా ఎవరికి వారు మాట్లాడుతుండటంతో పార్టీ అసలు స్టాండ్ ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### సీఎంతో బ్రేక్‌ఫాస్ట్‌పై అభ్యంతరాలు

అసెంబ్లీ సెంట్రల్ హాల్ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రితో కలిసి కొందరు బీజేపీ ఎమ్మెల్యేలు బ్రేక్‌ఫాస్ట్ చేయడం పార్టీలో చర్చకు కారణమైంది. అధికార పార్టీ నేతలతో కలిసి కార్యక్రమంలో పాల్గొనడంపై సొంత పార్టీ వర్గాల నుంచే అభ్యంతరాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. పార్టీ నిర్ణయం ఉంటే ఎమ్మెల్యేలంతా కలిసి వెళ్లడం లేదా పూర్తిగా దూరంగా ఉండటం సరైన విధానమని, కొందరు మాత్రమే అధికార పార్టీ నేతలతో కలిసి టేబుల్ పంచుకోవడం వల్ల తప్పుడు సంకేతాలు వెళ్తాయని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### ప్రభుత్వంపై ప్రశంసలు.. పార్టీలో చర్చ

కొందరు బీజేపీ ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వాన్ని, మంత్రులను ప్రశంసిస్తూ మాట్లాడుతున్నారన్న ప్రచారం కూడా పార్టీలో విస్మయానికి కారణమవుతోంది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలుగా ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాల్సిన సమయంలో ప్రశంసలు చేయడంపై కాషాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో శాసనసభాపక్షంలో సమన్వయం లేదన్న అభిప్రాయాలు బలపడుతున్నాయి.

### సభ వ్యూహంపైనా భిన్నాభిప్రాయాలు

సమావేశాల తొలి మూడు రోజుల్లో తమ డిమాండ్లు, వాయిదా తీర్మానాలను పరిగణనలోకి తీసుకోలేదంటూ బీజేపీ సభ్యులు వాకౌట్ చేశారు. నాలుగో రోజు అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలు సమావేశమైనప్పుడు సభకు వెళ్లాలా, వద్దా అన్న అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. ఈ విషయంలో వాదోపవాదాలు జరిగినట్లు సమాచారం. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో చర్చించినా ఏకాభిప్రాయం కుదరలేదన్న ప్రచారం సాగుతోంది.

### సభలోనూ భిన్న స్వరాలు

రాష్ట్ర సమస్యలను లేవనెత్తినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, మైక్ ఇవ్వకుండా కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుంటోందని కొందరు ఎమ్మెల్యేలు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. సభలో ఉండటం కంటే బయటకు వచ్చి నిరసన తెలపడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కొందరు సూచించినా.. మరికొందరు అందుకు భిన్నంగా వ్యవహరించినట్లు సమాచారం. సభలో ప్రస్తావించే అంశాల్లోనూ వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డేటా సెంటర్ల విషయంలో ఒక ఎమ్మెల్యే వ్యతిరేకంగా మాట్లాడితే.. మరో ఎమ్మెల్యే వాటి ఏర్పాటును సమర్థించడం ఇందుకు ఉదాహరణగా చెబుతున్నారు.

### ట్రాక్టర్ ర్యాలీలోనూ అంతే

పంటల బీమా పథకాన్ని అమలు చేయాలన్న డిమాండ్‌తో బీజేపీ శాసనసభాపక్ష ఉపనేత పాయల్ శంకర్ ట్రాక్టర్‌పై అసెంబ్లీకి వచ్చినా.. పార్టీ ఎమ్మెల్యేలంతా ఆ కార్యక్రమంలో పాల్గొనలేదు. ఇలాంటి సందర్భాలు మరికొన్ని ఉన్నాయని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. వ్యక్తిగత అజెండాలు, ఇగోలను పక్కనపెట్టి శాసనసభాపక్షం ఒకే తాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సమన్వయం మరింత కొరవడితే అసెంబ్లీ వేదికగా పార్టీ రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న ఆందోళన కేడర్‌లో వ్యక్తమవుతోంది.

# క్యాంప్ రాజకీయాలకు చెక్ పెట్టని అంజిరెడ్డి

- సొంత జిల్లాలో పార్టీ కార్యక్రమాలకు వరుసగా దూరం
- 22ఏ ఆందోళనలకు దూరంగా.. రాష్ట్ర ధర్నాలో ప్రత్యక్షం
- ఇతర పార్టీల నేతలతో ప్రైవేట్ కార్యక్రమాల్లో హాజరు
- రఘునందన్‌రావుతో విభేదాలపై పార్టీలో చర్చ
- వ్యక్తిగత వైరాలకు పార్టీ ప్రయోజనాలు బలికావొద్దంటున్న కేడర్
- అంజిరెడ్డి వ్యవహారంపై రాష్ట్ర నాయకత్వం దృష్టి

హైదరాబాద్, సెప్టెంబరు 13:

బీజేపీ ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి వ్యవహారశైలి ఉమ్మడి మెదక్ జిల్లా కమలం పార్టీలో చర్చకు దారితీస్తోంది. సొంత జిల్లాలో పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలకు వరుసగా దూరంగా ఉంటున్న ఆయన.. ఇతర పార్టీల నేతలతో కలిసి ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొంటుండటం ఆసక్తి రేపుతోంది. అదే సమయంలో జిల్లా దాటితే బీజేపీ కార్యక్రమాల్లో చురుగ్గా కనిపిస్తుండటంతో ఆయన వైఖరిపై పార్టీలో చర్చ సాగుతోంది.

### 22ఏ ఆందోళనలకు దూరం

ఆగస్టు 31న సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట బీజేపీ నిర్వహించిన 22ఏ భూముల మహాధర్నాకు రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ హాజరయ్యారు. అంజిరెడ్డి మాత్రం కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. ఈ నెల 2న నర్సాపూర్‌లో నిర్వహించిన మరో ధర్నాకు రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్ హాజరైనా అంజిరెడ్డి కనిపించలేదు. ఈ నెల 5న బీరంగూడలో 22ఏ బాధిత కుటుంబాలతో రఘునందన్‌రావు నిర్వహించిన సమావేశానికీ అంజిరెడ్డి హాజరుకాలేదు. అయితే అదే రోజు ఇందిరాపార్క్ వద్ద రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన 22ఏ మహాధర్నాలో మాత్రం పాల్గొన్నారు. దీంతో ఆయన సొంత జిల్లాలోని కార్యక్రమాలకు దూరంగా ఉండటంపై చర్చ మరింత పెరిగింది.

### ప్రైవేట్ కార్యక్రమాల్లో చురుగు

పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న అంజిరెడ్డి.. ప్రైవేట్ కార్యక్రమాల్లో మాత్రం కనిపిస్తుండటం కేడర్‌లో చర్చకు కారణమవుతోంది. బీరంగూడలో 22ఏ బాధితుల సమావేశానికి వెళ్లని ఆయన.. మరుసటి రోజే అదే నియోజకవర్గంలో నిర్వహించిన పొల్యూషన్ ఫ్రీ రన్‌లో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. నర్సాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి హాజరయ్యారు.

### రఘునందన్‌తో విభేదాలేనా?

అంజిరెడ్డి, రఘునందన్‌రావు మధ్య విభేదాలే ఈ దూరానికి కారణమన్న ప్రచారం పార్టీలో ఊపందుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ ఎంపీ టికెట్ కోసం ఇద్దరూ పోటీ పడగా.. చివరకు రఘునందన్‌రావుకే అవకాశం దక్కింది. ఆయన ఎంపీగా గెలిచిన తర్వాత అంజిరెడ్డి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా విజయం సాధించారు. అయినప్పటికీ ఇద్దరి మధ్య దూరం కొనసాగుతోందన్న
చర్చ ఉంది. రఘునందన్‌రావు ఆధ్వర్యంలోని కార్యక్రమాలకు అంజిరెడ్డి దూరంగా ఉండటానికి ఇదే కారణమన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

### పార్టీ ప్రయోజనాలపై కేడర్ దృష్టి

వ్యక్తిగత విభేదాలు ఉంటే వాటిని పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండేందుకు కారణంగా మార్చుకోవద్దని కాషాయ కేడర్ అభిప్రాయపడుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీ బలోపేతానికి రఘునందన్‌రావుతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని చెబుతోంది. ఇతర పార్టీల నేతలతో ప్రైవేట్
కార్యక్రమాల్లో పాల్గొనడం తప్పు కాదని, అదే సమయంలో సొంత పార్టీ నేతల మధ్య విభేదాలను పరిష్కరించుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచిస్తోంది. వ్యక్తిగత వైరాలు, ఇగోల కంటే పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతోంది. ఈ వ్యవహారంపై రాష్ట్ర నాయకత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# గణేశ మండపాలకు ఉచిత విద్యుత్

- భక్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం కానుక

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 13:



సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం ప్రజా పాలనకు నిదర్శనం బోథ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆలపాటి అచ్యుతానంద్‌రెడ్డి గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని బోథ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆలపాటి అచ్యుతానంద్‌రెడ్డి అన్నారు.
దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గణేశ్ ఉత్సవాల నిర్వాహకులపై విద్యుత్ బిల్లుల భారం లేకుండా చేయడం ద్వారా ప్రభుత్వం భక్తుల సౌకర్యానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గణేశ్ మండపాల నిర్వాహకులు సంబంధిత విద్యుత్ అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందాలని అచ్యుతానంద్‌రెడ్డి సూచించారు. మండపాల వద్ద విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు
చర్యలు చేపట్టాలని కోరారు.* అలాగే మండపాల వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లలో ముందుగానే తెలియజేయాలని నిర్వాహకులకు సూచించారు. దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బందులను నివారించడంతో
పాటు, భక్తుల భద్రతకు అవసరమైన చర్యలను పోలీసులు మరింత సమర్థంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు.*

# బాక్స్ బయటి నుంచి మెస్సీ మ్యాజిక్.. అద్భుతమైన గోల్‌తో అందరినీ మెస్మరైజ్ చేసిన సాకర్ దిగ్గజం!

- మేజర్ లీగ్ సాకర్‌లో ఇంటర్ మయామి, నాష్‌విల్లే మ్యాచ్ 2-2తో డ్రా
- బాక్స్ బయటి నుంచి అద్భుత గోల్‌తో మెస్సీ మయామికి ఆధిక్యం
- ఈ సీజన్‌లో 19వ గోల్ నమోదు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచిన మెస్సీ
- నాష్‌విల్లే తరఫున రెండు గోల్స్ చేసిన సామ్ సరిడ్జ్
- ఇంజురీ టైమ్‌లో గోల్ చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించిన నాష్‌విల్లే

అఖండ సూర్య :

మేజర్ లీగ్ సాకర్‌లో అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ మరోసారి తన మాయాజాలాన్ని ప్రదర్శించాడు. నాష్‌విల్లే ఎస్సీతో జరిగిన మ్యాచ్‌లో పెనాల్టీ బాక్స్ బయటి నుంచి అద్భుతమైన గోల్ కొట్టి తన జట్టు ఇంటర్ మయామిని ఆధిక్యంలో నిలిపాడు. అయినప్పటికీ, ఈ మ్యాచ్‌లో మయామికి విజయం దక్కలేదు. ఆఖరి నిమిషంలో నాష్‌విల్లే గోల్ చేయడంతో మ్యాచ్ 22తో డ్రాగా ముగిసింది.

నిన్న జరిగిన ఈ మ్యాచ్ ఆరంభంలోనే నాష్‌విల్లే దూకుడు కనబరిచింది. ఆట మొదలైన నాలుగో నిమిషంలోనే సామ్ సరిడ్జ్ గోల్ చేసి నాష్‌విల్లేకు 10 ఆధిక్యాన్ని అందించాడు. అయితే, ఇంటర్ మయామి వెంటనే తేరుకుంది. 19వ నిమిషంలో మెస్సీ కొట్టిన కార్నర్ కిక్‌ను అడ్డుకోబోయిన నాష్‌విల్లే డిఫెండర్ రీడ్ బేకర్‌వైటింగ్, పొరపాటున బంతిని తమ సొంత గోల్ పోస్టులోకి పంపడంతో స్కోరు 11తో సమమైంది.

రెండో అర్ధభాగంలో మెస్సీ తన మార్క్ ఆటతో అభిమానులను ఉర్రూతలూగించాడు. 62వ నిమిషంలో సహచర ఆటగాడు రోడ్రిగో డి పాల్ నుంచి పాస్ అందుకున్న మెస్సీ, పెనాల్టీ ఏరియా బయటి నుంచి తన ఎడమ కాలితో కొట్టిన అద్భుతమైన షాట్ నేరుగా గోల్ నెట్‌లోకి దూసుకెళ్లింది. ఈ గోల్‌తో ఇంటర్ మయామి 21 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ సీజన్‌లో మెస్సీకి ఇది 19వ గోల్ కాగా, టాప్ స్కోరర్‌గా తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. 2023లో మయామి జట్టులో చేరినప్పటి నుంచి నాష్‌విల్లేపై ఆడిన 14 మ్యాచ్‌లలో మెస్సీకి ఇది 17వ గోల్ కావడం గమనార్హం.

మ్యాచ్ మయామి గెలుస్తుందని అంతా భావిస్తున్న తరుణంలో నాష్‌విల్లే అనూహ్యంగా పుంజుకుంది. ఇంజురీ టైమ్‌లో సామ్ సరిడ్జ్ మరోసారి గోల్ చేసి స్కోరును 22తో సమం చేశాడు. దీంతో గెలుపు అంచుల వరకు వచ్చి మయామి డ్రాతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఫలితంతో ఈస్టర్న్ కాన్ఫరెన్స్ పట్టికలో అగ్రస్థానంలో ఉన్న నాష్‌విల్లే కంటే ఇంటర్ మయామి 9 పాయింట్ల వెనుకంజలో నిలిచింది. రెగ్యులర్ సీజన్‌లో మయామికి ఇంకా తొమ్మిది మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి.




# మోదీజీ.. హ్యాట్సాఫ్.. అంతర్జాతీయ దౌత్యం అంటే ఇదే

- బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ దౌత్యానికి రవిశాస్త్రి జేజేలు
- పుతిన్, జిన్‌పింగ్‌తో కలిసి మోదీ మొక్కలు నాటుతున్న ఫొటో షేర్
- భారతీయుడిగా ఎన్నడూ ఇంత గర్వపడలేదంటూ ట్వీట్
- ఇది మునుపెన్నడూ చూడని దౌత్యమని ప్రధానిని కొనియాడిన శాస్త్రి

అఖండ సూర్య :

భారత క్రికెట్ జట్టు మాజీ కోచ్, ప్రముఖ వ్యాఖ్యాత రవిశాస్త్రి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రశంసల వర్షం కురిపించాడు. ఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ ప్రదర్శిస్తున్న అంతర్జాతీయ దౌత్యనీతిని కొనియాడాడు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఓ ఆసక్తికర పోస్ట్ చేశాడు.

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో కలిసి ప్రధాని మోదీ మొక్కలు నాటుతున్న ఫొటోను రవిశాస్త్రి పంచుకున్నాడు. సదస్సు జరుగుతున్న 'భారత్ మండపం'లో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ ఫొటోను షేర్ చేస్తూ.. "ఒక భారతీయుడిగా నేనెప్పుడూ ఇంత గర్వంగా ఫీల్ అవ్వలేదు. అధ్యక్షుడు పుతిన్, అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, మన అద్భుతమైన ప్రధాని నరేంద్ర మోదీ అంతా మాతృభూమి భారత్‌లో ఒకేచోట ఉన్నారు. ఇది మునుపెన్నడూ చూడని అంతర్జాతీయ దౌత్యం. మోదీ జీ.. మీకు నా హ్యాట్సాఫ్" అంటూ తన పోస్టులో పేర్కొన్నాడు.

భారత్ అధ్యక్షతన న్యూఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో 18వ బ్రిక్స్ సదస్సు జరుగుతోంది. "స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. సభ్య దేశాలతో పాటు భాగస్వామ్య దేశాల అధినేతలు ఇందులో పాల్గొన్నారు. సదస్సులో భాగంగా నిన్న బ్రిక్స్ నేతలు 'న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026'ను ఆమోదించారు.

సదస్సు చివరి రోజైన నేడు ప్రధాని మోదీ పలు దేశాల అధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ జాబితాలో దక్షిణాఫ్రికా, కజకిస్థాన్, ఫిలిప్పీన్స్, ఈజిప్ట్, బురుండి, ఉగాండా, నైజీరియా వంటి దేశాలు ఉన్నాయి. భారత్ తరఫున 80 టెస్టులు, 150 వన్డేలు ఆడిన రవిశాస్త్రి, ఆ తర్వాత భారత జట్టుకు హెడ్ కోచ్‌గా కూడా పనిచేశాడు. ప్రస్తుతం భారత క్రికెట్‌లో ఓ ప్రముఖ వ్యాఖ్యాతగా, విశ్లేషకుడిగా కొనసాగుతున్నాడు.




# షమీ వయసుపై చర్చ.. కోహ్లీ, రోహిత్‌లను చూపిస్తూ చోప్రా కౌంటర్

- టీమిండియాలో షమీ ఎంపికపై స్పందించిన మాజీ క్రికెటర్
- వయసు కారణంగా షమీని పక్కనపెట్టారన్న వాదన పూర్తిగా అసంబద్ధమన్న చోప్రా
- కోహ్లీ, రోహిత్‌లు ఆడుతున్నప్పుడు వయసు ఎలా కారణమవుతుందని ప్రశ్న
- ఫిట్‌గా లేకపోవడమే సమస్య తప్ప, వయసు కాదని పరోక్షంగా వ్యాఖ్య

అఖండ సూర్య :



భారత సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీని వయసు కారణంగానే జట్టులోకి తీసుకోవడం లేదనే వాదనలను మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా తోసిపుచ్చాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి సీనియర్లు ఇంకా జట్టులో కొనసాగుతున్నప్పుడు, ఒక్క షమీ విషయంలోనే వయసును కారణంగా చూపడం సరికాదని స్పష్టం చేశాడు.

36 ఏళ్ల షమీ గత ఏడాదిన్నరగా పదేపదే గాయాల బారిన పడుతూ జాతీయ జట్టుకు దూరంగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ యువ బౌలర్ల వైపు మొగ్గుచూపుతోంది. దీంతో షమీ కెరీర్ వయసు కారణంగానే ముగింపు దశకు వచ్చిందనే ప్రచారం జరుగుతోంది.

ఈ వాదనలపై తాజాగా స్పందించిన ఆకాశ్ చోప్రా "షమీకి వయసు ప్రతికూలంగా మారిందా? అది పూర్తిగా అసంబద్ధం. జట్టులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి అనుభవజ్ఞులను ఎంపిక చేస్తున్నప్పుడు, వయసు కారణంగా ఒకరిని తొలగించడంలో అర్థం లేదు. నా అంచనా ప్రకారం, షమీ ఎంపికలో వయసు అస్సలు కారణం కాదు. సెలక్టర్లు ఏదో ఒక రోజు కారణం చెబుతారు, కానీ అది మాత్రం వయసు అయి ఉండదు" అని ఒక వీడియోలో స్పష్టం చేశాడు. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్‌తో షమీని పోల్చుతూ చోప్రా మరిన్ని విషయాలు వివరించాడు. "స్టార్క్ పూర్తి ఫిట్‌గా ఉంటూ నిరంతరం ఆడుతున్నాడు. జట్టులోకి వచ్చిన ప్రతీసారి బౌలింగ్ దాడిని ముందుండి నడిపించాడు. అతడి ఫామ్, ఫిట్‌నెస్, పదునుపై ఎలాంటి సందేహాలు లేవు" అని అన్నాడు. షమీ విషయంలో గాయాలు, ఫిట్‌నెస్ ప్రధాన సమస్యగా ఉన్నాయని పరోక్షంగా సూచించాడు.

షమీ చివరిసారిగా 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత జట్టుకు ఆడాడు. ఆ తర్వాత వరుస గాయాలతో బాధపడుతూ జట్టుకు అందుబాటులో లేకుండా పోయాడు.

# పాక్ పై క్లీన్‌స్వీప్.. డబ్ల్యూటీసీ రేసులో భారత్‌కు చేరువైన ఇంగ్లండ్

- పాకిస్థాన్‌పై 3-0 తేడాతో టెస్టు సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన ఇంగ్లండ్
- డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్‌కు చేరువైన ఇంగ్లీష్ జట్టు
- అట్టడుగు స్థానంలో మరింత దిగజారిన పాకిస్థాన్
- ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తొలి రెండు స్థానాల్లో కొనసాగింపు
- భారత్ కంటే ముందు నాలుగో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్

అఖండ సూర్య :



పాకిస్థాన్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను ఇంగ్లండ్ క్లీన్‌స్వీప్ చేసింది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన చివరి టెస్టులో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, సిరీస్‌ను 30తో కైవసం చేసుకుంది. ఈ విజయంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC) పాయింట్ల పట్టికలో ఇంగ్లండ్ తన ఆరో స్థానాన్ని పటిష్ఠం చేసుకోవడమే కాకుండా, ఐదో స్థానంలో ఉన్న భారత్‌కు రేటింగ్ పరంగా మరింత చేరువైంది.

మూడో టెస్టులో 130 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్, జో రూట్, జోర్డాన్ కాక్స్ అర్ధశతకాలతో రాణించడంతో సునాయాసంగా విజయం సాధించింది. తమ సొంతగడ్డపై పాకిస్థాన్‌ను వైట్‌వాష్ చేయడం ఇంగ్లండ్‌కు ఇదే తొలిసారి కావడం విశేషం.

ఈ విజయంతో ఇంగ్లండ్ డబ్ల్యూటీసీ పాయింట్ల సంఖ్య 74కు పెరిగింది. 16 మ్యాచ్‌ల అనంతరం వారి పర్సంటేజ్ ఆఫ్ పాయింట్స్ (PCT) 38.54 శాతానికి మెరుగుపడింది. గతంలో స్లో ఓవర్ రేట్ కారణంగా 14 పాయింట్ల కోతకు గురైన ఇంగ్లండ్, ఈ గెలుపుతో కాస్త ఊరట పొందింది. మరోవైపు, ఈ ఓటమితో పాకిస్థాన్ పరిస్థితి మరింత దిగజారింది. ఇప్పటికే పట్టికలో అట్టడుగున తొమ్మిదో స్థానంలో ఉన్న ఆ జట్టు పీసీటీ 16.67 శాతం నుంచి 14.81 శాతానికి పడిపోయింది. పాకిస్థాన్‌పై కూడా స్లో ఓవర్ రేట్ కారణంగా 8 పాయింట్ల కోత పడింది.

డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా 80 పీసీటీతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, దక్షిణాఫ్రికా (75 పీసీటీ), న్యూజిలాండ్ (72.22 పీసీటీ) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఆశ్చర్యకరంగా బంగ్లాదేశ్ 55.56 PCTతో భారత్ కంటే ముందు నాలుగో స్థానంలో నిలిచింది. టీమిండియా 11 మ్యాచ్‌లలో 51.52 పీసీటీతో ఐదో స్థానంలో ఉంది. శ్రీలంక, వెస్టిండీస్ ఏడు, ఎనిమిది స్థానాల్లో ఉన్నాయి.

వచ్చే ఏడాది జూన్ 9 నుంచి 13 వరకు లండన్‌లోని ఓవల్ మైదానంలో జరిగే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు అర్హత సాధిస్తాయి.

# చాలా దూకుడైన వ్యక్తి.. గంభీర్ మనస్తత్వం ఎలాంటిదో చెప్పిన అయ్యర్

- హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో తనది బలమైన బంధమని చెప్పిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్
- గంభీర్ దూకుడు స్వభావం, ఆటగాళ్లకు స్పష్టతనిచ్చే తీరు జట్టుకు మేలు చేస్తుందని వెల్లడి
- గతంలో కేకేఆర్ తరఫున తామిద్దరం కలిసి ఐపీఎల్ టైటిల్ గెలిచామని గుర్తు చేసిన అయ్యర్
- ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌పై దృష్టి పెట్టామని, ఒక్కో మ్యాచ్‌ను సీరియస్‌గా తీసుకుంటామని స్పష్టీకరణ
- ఆసియా క్రీడల్లో పాల్గొనడంపై తొలిసారిగా ఆనందం వ్యక్తం చేసిన భారత కెప్టెన్

అఖండ సూర్య :

ఆటకు సంబంధించినంత వరకు భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో తనకు బలమైన బంధం ఉందని, ఇది జట్టులో స్పష్టమైన కమ్యూనికేషన్‌కు, దూకుడైన ఆటతీరుకు ఉపయోగపడుతుందని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ఆదివారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న టీ20 మ్యాచ్‌కు ముందు శనివారం జరిగిన మీడియా సమావేశంలో అయ్యర్ మాట్లాడాడు. తమ ఇద్దరి మధ్య ఉన్న అవగాహన జట్టుకు ఎంతో మేలు చేస్తుందని ధీమా వ్యక్తం చేశాడు.

గతంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తరఫున 2024 ఐపీఎల్ సీజన్‌లో కెప్టెన్‌మెంటార్‌గా శ్రేయస్, గంభీర్ కలిసి పనిచేసి జట్టుకు టైటిల్ అందించిన విషయం తెలిసిందే. ఈ అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, గంభీర్ కోచింగ్ శైలిని అయ్యర్ ప్రశంసించాడు. "గంభీర్ చాలా దూకుడు స్వభావం ఉన్న వ్యక్తి. మైదానంలోకి అడుగుపెట్టాడంటే గెలుపు గురించే ఆలోచిస్తాడు. ప్రతి ఆటగాడు అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని కోరుకుంటాడు. జట్టు సభ్యుల్లో నమ్మకాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపుతాడు. ఎవరి పాత్ర ఏంటనే దానిపై స్పష్టత ఇస్తాడు" అని అయ్యర్ వివరించాడు.

ఆటగాళ్లతో వ్యక్తిగతంగా మాట్లాడి వారిని అర్థం చేసుకునే గంభీర్ విధానం అద్భుతమని శ్రేయస్ కొనియాడాడు. "ప్రతి ఆటగాడితో వ్యక్తిగత సంబంధాన్ని కొనసాగించడం కోచింగ్‌లో చాలా ముఖ్యం. ఎందుకంటే జట్టులోని ఒక్కొక్కరిది ఒక్కో శైలి. గౌతీ భాయ్ (గంభీర్) మనస్తత్వం, అతడి ఆలోచనా విధానం నాకు బాగా తెలుసు. మేం ఎన్ని ఎక్కువ మ్యాచ్‌లు గెలిస్తే, మా మధ్య బంధం అంత బలపడుతుంది" అని అయ్యర్ తెలిపాడు.



ఆఫ్ఘనిస్థాన్‌తో జరగబోయే సిరీస్ గురించి మాట్లాడుతూ, ప్రత్యర్థిని తేలిగ్గా తీసుకోవట్లేదని స్పష్టం చేశాడు. "మేం భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచించట్లేదు. ప్రస్తుతం తొలి మ్యాచ్‌పైనే మా దృష్టి ఉంది. ఆఫ్ఘనిస్థాన్ బలమైన జట్టు. వారి ఆటగాళ్లకు ఐపీఎల్ ఆడిన అనుభవం వల్ల ఇక్కడి పరిస్థితులపై మంచి అవగాహన ఉంది. మా సన్నద్ధత కూడా చాలా బాగుంది. ఆసియా క్రీడలకు ముందు ఇలాంటి నాణ్యమైన జట్టుతో ఆడటం మాకు మంచి అవకాశం" అని అయ్యర్ పేర్కొన్నాడు.

తొలిసారిగా ఆసియా క్రీడల్లో పాల్గొనడంపై శ్రేయస్ అయ్యర్ ఉత్సాహం వ్యక్తం చేశాడు. "ఇది నాకు, జట్టుకు చాలా ఉత్సాహకరమైన సమయం. గత ఆసియా క్రీడల్లో పాల్గొన్న కొందరు ఆటగాళ్లు ఇప్పుడు కూడా జట్టులో ఉన్నారు. అక్కడ ఇతర క్రీడలకు చెందిన అథ్లెట్లతో సంభాషించడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఒక దేశంగా వెళ్లి, విజయంతో తిరిగి రావాలని కోరుకుంటున్నాం" అని అయ్యర్ ముగించాడు.

# టీనేజ్ పిల్లలను ఇలా పెంచండి..!



**మన సమాజంలో తల్లిదండ్రులు పెరుగుతున్న వయస్సులో వచ్చే మార్పులు గురించి సరిగ్గా చెప్పరు. అయితే, ఇదే అతి పెద్ద తప్పు. ప్రతి వయస్సు పిల్లలకు కొత్తది. వయసు పెరిగే కొద్దీ శరీరంలో మార్పులు వచ్చినప్పుడు ఆందోళన చెందుతారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కూర్చోబెట్టి యుక్తవయస్సు గురించి చెప్పాలి. ప్రతి పేరెంట్ అబ్బాయిలను కూర్చోబెట్టి గడ్డం, మీసాలు, గొంతులో మార్పు, యవ్వనంలో కలిగే కోరికలు గురించి చెప్పాలి. అదేవిధంగా ఆడపిల్లలకు పీరియడ్స్ గురించి చెప్పాలి. ఇలా చేయడం వల్ల వారు ఆకస్మిక మార్పులకు భయపడరు.**

మన సమాజంలో తల్లిదండ్రులు పెరుగుతున్న వయస్సులో వచ్చే మార్పులు గురించి సరిగ్గా చెప్పరు. అయితే, ఇదే అతి పెద్ద తప్పు. ప్రతి వయస్సు పిల్లలకు కొత్తది. వయసు పెరిగే కొద్దీ శరీరంలో మార్పులు వచ్చినప్పుడు ఆందోళన చెందుతారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కూర్చోబెట్టి యుక్తవయస్సు గురించి చెప్పాలి. ప్రతి పేరెంట్ అబ్బాయిలను కూర్చోబెట్టి గడ్డం, మీసాలు, గొంతులో మార్పు, యవ్వనంలో కలిగే కోరికలు గురించి చెప్పాలి. అదేవిధంగా ఆడపిల్లలకు పీరియడ్స్ గురించి చెప్పాలి. ఇలా చేయడం వల్ల వారు ఆకస్మిక మార్పులకు భయపడరు.

**ప్రశాంతంగా సలహాలు ఇవ్వండి..**

టీనేజ్ పిల్లలు ఎవరి మాట వినడానికి ఇష్టపడరు. వారు చేసిందే కరెక్ట్ అనుకుంటారు. దీంతో తల్లిదండ్రులకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తారు. తల్లిదండ్రుల మాట వినరు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు వారిని తిట్టకూడదు లేదంటే కొట్టకూడదు. తల్లిదండ్రులు కూడా వారి వయసుకు వచ్చారని అర్థం చేసుకోవాలి. అందుకే వారితో ప్రశాంతంగా కూర్చొని మంచి సలహాలు ఇవ్వండి. అంతేకానీ మీ నిర్ణయాల్ని వారిపై బలవంతంగా రుద్దకండి. ఏదైనా సరే వారికి ప్రేమగా వివరించండి.

**పిల్లలను గౌరవించడం, వారి మాట వినడం..**

తల్లిదండ్రులు తమ పిల్లలను గౌరవించడం కూడా చాలా ముఖ్యం. పిల్లలకు సొంత వ్యక్తిత్వం ఉంటుంది. టీనేజ్ పిల్లలకు కూడా కొన్ని ఇష్టాలు, అయిష్టాలు ఉంటాయి. అందుకే వారు చెప్పే ప్రతిదాన్ని ప్రశాంతంగా వినండి. చాలా సార్లు పిల్లలు తెలిసి లేదా తెలియక కొన్ని తప్పులు చేస్తారు. కొన్ని సార్లు మంచి పనులు కూడా చేస్తారు. అందుకే వారి ఏది చేసినా జాగ్రత్తగా పరిశీలించండి. తప్పుడు దోవలో పోతే వారిని సరిదిద్దండి. మంచి పనులు అయితే వారిని ప్రోత్సహించండి. పిల్లలకు గౌరవం లభిస్తే, వారు కూడా తల్లిదండ్రుల్ని గౌరవిస్తారు. ప్రతి పని చేసేలా వారిని ప్రేరేపించాలి. పిల్లలు ఏదైనా అడిగినప్పుడు.. ప్రశాంతంగా వారి ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి.

**మంచి నేర్పండి..**

ప్రతి ఒక్కరూ పిల్లలను పైలట్, ఇంజనీర్, డాక్టర్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కావాలని కలలు కంటుంటారు. అయితే, వారిని మంచి మనుషులగా మార్చడంలో కూడా శ్రద్ధ పెట్టాలి. చిన్నతనం నుంచే వారికి కొన్ని మంచి పనులు నేర్పండి. దానధర్మాల చేయడం, పేదలకు వారి చేతుల మీదుగా కొన్ని వస్తువుల్ని పంచి పెట్టడం, మంచి పని కోసం విరాళాలు సేకరించడం ఇలా పనులు చేయించాలి. జంతువులు, పెద్దల పట్ల మంచిగా మెలిగేలా వారికి నేర్పించండి. చిన్న చిన్న పనులే వారిలో దయ, మానవత్వాన్ని పెంచుతాయి.

**ఒంటరిగా వదిలేయకండి..**

ఈ వయసులో టీనేజ్ పిల్లలు ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు . అయితే వారిని ఒంటరిగా వదిలిపెట్టకూడదు. వారిని ఏదో ఒక పనిలో బిజీగా ఉంచండి. ఇంటి పనులు చేయించడం.. బయటి నుంచి ఏదైనా వస్తువు తీసుకురమ్మనడం లాంటి పనులు చేయించండి. చాలా మంది తల్లిదండ్రులు అమ్మాయిలతో ఇంటి పనులు చేయిస్తారు. కానీ అబ్బాయిలను ఏ పని చేయమని అడగరు. అలా చేయడం తప్పు. అబ్బాయిలు కూడా బాధ్యతగా ఉండాలి. వాళ్లు కూడా ఆడపిల్లల్లా ప్రతి పని చేయగలగాలి.

**నైపుణ్యాలపై శ్రద్ధ పెట్టండి..**

ప్రతి పిల్లల్లో ఖచ్చితంగా ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. తల్లిదండ్రులు దాన్ని బయటకు తీసి సాన బెట్టాలి. పిల్లలకు ఎందులో టాలెంట్ ఉందో అందులో ముందుకు సాగేలా ప్రోత్సహించండి. వారికి ఎలాంటి నైపుణ్యాలు లేకపోయినా చింతించకండి. వారికి నచ్చిన విధంగా నైపుణ్యాలను నేర్పించండి. సంగీతం, నృత్యం, పెయింటింగ్, స్విమ్మింగ్, క్రీడలు ఏదైనా సరే ఎంకరేజ్ చేయండి. ఇది పిల్లల నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది. మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. వాస్తవానికి, పిల్లలు కౌమారదశలో ప్రతికూలతకు గురవుతారు. కానీ నైపుణ్యాలు వారి ఆలోచనలను సానుకూలంగా చేస్తాయి.

**డబ్బు విలువ నేర్పండి..**

తల్లిదండ్రులు తమ పిల్లల ప్రతి కోరికను తీర్చడం చాలా ముఖ్యమనుకుంటారు. అయితే, ఇలా చేస్తే వారు డబ్బుకు విలువ ఇవ్వరు. పిల్లలకు చిన్నతనం నుంచే డబ్బు విలువ నేర్పించడం చాలా ముఖ్యం. వారు అడిగే ప్రతి డిమాండ్‌ను నెరవేర్చాల్సిన అవసరం లేదు. వారికి నెలకు సరిపడా పాకెట్ మనీ ఇవ్వండి. అందులోనే అన్ని ఖర్చులు ప్లాన్ చేసుకోమని చెప్పండి. అంతేకాకుండా డబ్బుల్ని పొదుపు చేయమని కూడా చెప్పండి. ఖర్చుల్ని స్వయంగా ప్లాన్ చేసుకుంటే వారికి డబ్బు విలువ తెలుస్తుంది. టీనేజ్ పిల్లలకు బ్యాంకింగ్, ద్రవ్యోల్బణం గురించి తెలిసేలా చెప్పండి.

గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ప్రవర్తనను బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం.

# కాకర .. ఇమ్యూనిటీ బూస్టర్



**కాకరకాయ.. ఇది చేదు రుచికి ప్రసిద్ధి చెందింది. చేదు రుచి ఉన్నప్పటికీ, మంచి పోషకాలతో నిండి ఉంటుంది. అలాగే అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. కాకరకాయ పోషకాల శక్తి కేంద్రం. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను మెరుగుపరచడం నుండి రోగనిరోధక శక్తిని పెంచడం వరకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఈ చేదు కూరగాయలను మీ ఆహారంలో చేర్చడం వల్ల మీ మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సుపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. కాబట్టి అది అందించే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందండి.**

కాకరకాయ.. ఇది చేదు రుచికి ప్రసిద్ధి చెందింది. చేదు రుచి ఉన్నప్పటికీ, మంచి పోషకాలతో నిండి ఉంటుంది. అలాగే అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. కాకరకాయ పోషకాల శక్తి కేంద్రం. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను మెరుగుపరచడం నుండి రోగనిరోధక శక్తిని పెంచడం వరకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఈ చేదు కూరగాయలను మీ ఆహారంలో చేర్చడం వల్ల మీ మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సుపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. కాబట్టి అది అందించే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందండి.

కాకరకాయలో కేలరీలు తక్కువగా ఉంటాయి. కానీ విటమిన్లు ఎ, సి, కె వంటి ముఖ్యమైన పోషకాలు, అలాగే ఐరన్, పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి.

ఇది డైటరీ ఫైబర్ మంచి మూలం. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. క్రమం తప్పకుండా ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. ఈ పోషకాలు వివిధ శారీరక విధులకు మద్దతు ఇవ్వడంలో అలాగే మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. కాకరకాయలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

ఇవి శరీరాన్ని ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షించడానికి, వాపును తగ్గించడానికి సహాయపడతాయి. బలమైన రోగనిరోధక వ్యవస్థను నిర్వహించడానికి అలాగే దీర్ఘకాలిక వ్యాధులను నివారించడానికి యాంటీఆక్సిడెంట్లు చాలా అవసరం. కాకరకాయ రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుందని, అలాగే ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరుస్తుందని తేలింది. ఇది డయాబెటిస్ ఉన్నవారికి విలువైన ఆహారంగా మారింది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను సమర్థవంతంగా నియంత్రించడంలో సహాయపడే ఇన్సులిన్ ప్రభావాలను అనుకరించే సమ్మేళనాలను కూడా కలిగి ఉంటుంది.

కాకరకాయలో కేలరీలు తక్కువగా, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది బరువు తగ్గించే ఆహారంలో అద్భుతమైన అదనంగా ఉంటుంది. ఫైబర్ కంటెంట్ మీకు ఎక్కువ సేపు కడుపు నిండుగా అనిపించడానికి సహాయపడుతుంది.

అతిగా తినడాన్ని నిరోధిస్తుంది. ఆరోగ్యకరమైన, స్థిరమైన మార్గంలో బరువు తగ్గడాన్ని ప్రోత్సహిస్తుంది. సమృద్ధిగా ఉండే విటమిన్లు, ఖనిజాలు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి అలాగే ఇన్ఫెక్షన్లను నివారించడానికి సహాయపడతాయి.

దీని యాంటీఆక్సిడెంట్ లక్షణాలు శరీరాన్ని హానికరమైన వ్యాధికారక కారకాల నుండి రక్షించడంలో మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కూడా పాత్ర పోషిస్తాయి. కాకరకాయలో విటమిన్ సీ పుష్కలంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తి, చర్మ ఆరోగ్యానికి అవసరం. ఇది మొటిమలను తగ్గించడానికి, చర్మ ఆకృతిని మెరుగుపరచడానికి అలాగే క్రమం తప్పకుండా సేవించినప్పుడు యవ్వన ప్రకాశాన్ని ప్రోత్సహించడానికి సహాయపడుతుంది. కాకరకాయలోని పీచు పదార్థం క్రమం తప్పకుండా ప్రేగు కదలికలను ప్రోత్సహించడం, మలబద్ధకాన్ని నివారించడం ద్వారా జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇది ఆరోగ్యకరమైన గట్ ఫ్లోరాను నిర్వహించడానికి కూడా సహాయపడుతుంది. ఇది మొత్తం జీర్ణ ఆరోగ్యానికి కీలకం.





# ఏది క్రష్.. ఏది లవ్

క్రష్, లవ్ ఈ రెండు పదాలకు తేడా లేకుండా పోయింది. యువత తాము ప్రేమలో పడుతున్నారా? లేదంటే అతడు/ఆమె అంటే క్రష్ ఉందా? అన్న విషయం పట్టించుకోకుండా ముందుకు సాగుతున్నారు. దీనివల్లే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. బ్రేకప్స్ అవుతున్నాయి. అసలు క్రష్ అంటే ఏంటి? లవ్ అంటే ఏంటి? ఈ కథనంలో తెలుసుకుందాం..

మనం నిజంగా ప్రేమిస్తున్నాం లేదంటే ఆకర్షితులవుతున్నామా అని కన్ఫ్యూజన్‌లో ఉంటాం. చాలా మంది యువత కేవలం అందం, డబ్బుకే ఆకర్షితులవుతున్నారు. కేవలం వాటిని చూసి మాత్రమే ప్రేమిస్తున్నారు. చాలా మంది అదే ప్రేమ అనుకుంటున్నారు. మనం ప్రేమించే అమ్మాయి/ అబ్బాయి గుణాలు ఎలాంటివి, మంచివారేనే అన్న విషయాలు పట్టించుకోవడం లేదు. మనం నిజంగానే ప్రేమిస్తున్నామా లేదంటే ఆకర్షణకు గురవుతున్నామా కచ్చితంగా తెలుసుకోవాలి. మీరు కూడా ఇదే గందరగోళంలో ఉంటే కొన్ని సంకేతాల ద్వారా మీరు ప్రేమిస్తున్నారా లేదా క్రష్ మాత్రమే చేస్తున్నారా అని తెలుసుకోవచ్చు.క్రష్ అనేది ఒకరి లుక్స్, స్టైల్ లేదా ప్రత్యేకమైన అలవాటు కారణంగా జరిగే ఆకర్షణ. ఈ ఆకర్షణ కొద్ది కాలం పాటు కొనసాగుతుంది. అయితే, రాను రాను ఇది క్షీణిస్తుంది. ఒకరిపై కాకుండా మరొకరి స్టైల్, లుక్స్, అందం కూడా మీరు ఆకర్షితులవుతుంటే అది క్రష్ మాత్రమే అని గుర్తించుకోవాలి.

నిజమైన ప్రేమ అనేది కాలక్రమణా పెరిగే అద్భుతమైన అనుభూతి. ప్రేమలో డబ్బు, స్టైల్, లుక్స్ వంటివి ఉండవు. ఒకరి కోసం మరొకరు నిలబడతారు. ప్రతి కష్టంలో తోడుగా ఉంటారు. ఒకరికి ఎవరిపైనైనా ప్రేమ ఉంటే, ఎప్పుడూ వారి గురించి మాత్రమే ఆలోచిస్తారు. వేరే ఆలోచనలు రావు. ప్రతి క్షణం అతడు లేదా ఆమెను కలవాలనే తపన ఉంటుంది. ప్రేమలో పడినప్పుడు ఆ అనుభూతి కొత్తగా ఉంటుంది. ప్రతి క్షణం ఆ వ్యక్తితో కలిసి జీవించాలనే కోరిక ఉంటుంది. భవిష్యత్తులోని ప్రతి ఆనందాన్ని తనతో పంచుకోవాలనే ఆశ ఉంటుంది. ఆకర్షణలో తాత్కాలిక కోరికలు మాత్రమే ఉంటాయని గుర్తించుకోవాలి.

మనకు ఒకరిపై క్రష్ ఏర్పడితే.. సాధారణంగా వారి దూరంగా వెళ్లినప్పుడు వేరే వారి మీద మనసు మళ్లుతుంది. అదే ప్రేమలో ఉంటే అలా జరగదు. ప్రేమించిన వ్యక్తి దూరంగా ఉన్నా సరే ఆలోచనలన్నీ అతను లేదా ఆమెపైనే ఉంటాయి. వారిని ఎప్పుడప్పుడూ కలుస్తామా అన్న ఆశ ఉంటుంది. అదే ఆకర్షణ అయితే ఇలాంటి అనుభూతులు ఏం ఉండవు. వీళ్లు కాకపోతే ఇంకొకరు అనే మైండ్ సెట్ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.క్రష్ అనేది నశ్వరమైన భావోద్వేగం. అంటే కాలంతో పాటు మసకబారుతున్న అనుభూతి అని అర్థం. ఉదహరణకు ఒకరి మీద క్రష్ ఉంటే.. కాలం మారేకొద్ది వారిపై ఆలోచనలు మారుతాయి. కొత్త వ్యక్తులపై ధ్యాస పోతుంది. అదే ప్రేమలో మాత్రం.. ఇలాంటివి ఉండవు. ప్రేమ అనేది కాలక్రమంలో కూడా ప్రకాశవంతంగా మండే అగ్ని లాంటిది. ఎన్ని కష్టాలు వచ్చినా.. ఎవరు ఎన్ని చెప్పినా ప్రేమ అనే భావన చాలా బలంగా ఉంటుంది. మీరు ప్రేమించే వారి కన్నా అందమైన లేదా డబ్బున్న వారు కనబడిన కూడా ఈ భావన అలాగే ఉంటుంది.ఎవరితోనైనా క్రష్‌లో ఉన్నప్పుడు వారిలో లోపాలు కనిపించవు. వారు మనకు కరెక్ట్ అన్న భావన ఉంటుంది. రాను రాను పూర్తి నిజం తెలుస్తుంది. ప్రతి విషయంలో కూడా లోపం వెతుకుతారు. నిజమైన ప్రేమలో అలా ఉండదు. ప్రేమించిన వారి లోపాల్ని పూర్తిగా అంగీకరిస్తారు. ప్రేమించిన వారి పరిమితుల్ని అర్థం చేసుకుంటారు. వారికి కష్టకాలంలో కూడా సాయం చేయడానికి ముందుకు వస్తారు. అదే క్రష్ అయితే ఇలాంటివి ఏం పట్టించుకోరు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.